J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 46 సంచిక : 8 24.7.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## తిరుమలలో.. ఏం జరుగుతోంది?

# స్వామి చుట్టూ స్వార్థపరులు, స్వాహారాయుళ్లు!



- దాతల దర్శనాలకి కత్తెర.. తమ ఇష్టానుసారం నిబంధనలలో మార్పులు
- అధికార ప్రముఖులకు దివ్యదర్శనంతో స్వాగతం
- సామాన్యులకి మాత్రం లఘుదర్శనానికి పరిమితం
- రూ.300 టిక్కెట్లు బ్లాకులో విచ్చలవిడిగా రూ.3000 లకి లభ్యం
- క్షణాల్లో కరిగిపోతున్న శ్రీవాణి కోటా!...

**క**లియుగ దైవం శ్రీవేంకటేశ్వరుడు కొలువైన తిరుమల పుణ్యక్షేత్రం పరమ పవిత్రం. ఇక్కడి స్వామివారిని ఒక్కసారైనా దర్శించుకుని తన్మయత్వం చెందాలని, స్వామి సేవలో భాగస్వాములు కావాలని కోట్లాదిమంది భక్తులు పరితపిస్తుంటారు. ఇందుకోసం టీటీడీ అందిస్తున్న సదుపాయాలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. ముఖ్యంగా దాతలు తమతమ ఆర్థిక స్థోమత మేరకు స్వామివారికి విరాళాలు అందించి, స్వామివారి సేవకు పాత్రులవ్వాలని ఆకాంక్షిస్తుంటారు. అయితే సంస్కరణల పేరుతో టీటీడీ అధికారులు తీసుకొస్తున్న మార్పులు దాతల పాలిట శాపంగా మారుతున్నాయి. "అయినవారికి ఆకుల్లో... కాని వారికి కంచాల్లో" అన్న చందంగా పాలకమండలి సభ్యులు, అధికారులు వారివారి పరివారానికి ముందస్తుగా సంస్కరణ విషయాలను ఉప్పందించి, సిండికేట్‌గా మారుతున్నారు. తద్వారా అందినకాడికి దండుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. తమవారికి మాత్రం ఆలయ సౌకర్యాలు అందేలా తాపత్రయపడుతున్నారు. ఫలితంగా స్వామి వారి సేవకు ఆతృతతో ఎదురుచూసే నిజమైన భక్తులకు నిరాశే మిగులుతోంది.

**తా**జాగా టీటీడీ పాలకమండలి సమావేశం జులై 14వతేదీ మంగళవారం నాడు జరిగింది. అదేరోజు విరాళాలు ఇచ్చే దాతల సౌకర్యాలపై కొత్త నిబంధనలు విధిస్తూ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. జులై 14వ తేదీ అర్ధరాత్రి అంటే 15వ తేదీ బుధవారం ఉదయం

2లో



# స్వామి చుట్టూ స్వార్థపరులు, స్వాహారాయుళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

నుండి ఈ కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయని ప్రకటించింది. 14వతేదీ (అంటే పాలకమండలి సమావేశం జరిగిన రోజు) మాత్రం విరాళాలు ఇచ్చిన వారికి పాత నిబంధనలే వర్తిస్తాయని కూడా ప్రకటించింది. అయితే, అనూహ్యంగా పాలక మండలి సమావేశం జరిగిన ఆ ఒక్కరోజే దాదాపు 97 కోట్ల రూపాయలు విరాళాల రూపంలో రావడం గమనార్హం. అమరావతిలో జరిగిన ఇన్సైడర్ ట్రేడింగ్ తరహాలో టీటీడీ పాలక మండలి, అధికారులు రాబోయే కొత్త నిబంధనలని ముందుగానే తమ వారికి ఉప్పందించి విరాళాలు సేకరించారన్నది ఇక్కడ స్పష్టంగా అర్థమవుతుంది. ఈ ఒక్క సంఘటనే టీటీడీ పెద్దల స్వార్థపూరిత తత్వానికి అద్దం పడుతుందని భక్తులు ఆరోపిస్తున్నారు.

## సేవల్లో మార్పులు ఎందుకోసం.. ఎవరికోసం..?

తిరుమల కొండ సకల తీర్థాలకు నిలయం. ఎన్నో వృక్షజాతులు, జంతువులకు ఆశ్రయమిచ్చే శేషాచలం కొండలు ఎప్పుడూ ఆధ్యాత్మిక శోభతో దేదీప్యమానంగా వెలుగుతుంటాయి. రోజూ లక్షలాది మంది భక్తులు స్వామి సేవ కోసం మనదేశం నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం కొండకు క్యూ కడుతుంటారు. వివిధ రకాల సేవల్లో పాల్గొని జన్మ ధన్యమైనట్లు భావిస్తుంటారు. ఈ క్రమంలోనే విరాళాలిచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం వివిధ సదుపాయాలతో వారిని సంతృప్తిపరుస్తోంది. ఇక భక్తులు కూడా ఆపద మొక్కుల వాడికి ఎన్నో రూపాల్లో కానుకలు సమర్పిస్తుంటారు. వారికి టీటీడీ స్వామి దర్శన భాగ్యంతో పాటు వివిధ బహుమతులందించి ఆనందానుభూతులను కలుగజేస్తోంది. రూ.10 వేల నుంచి రూ. కోటి.. ఆపైగా అందజేసిన వారికి పలు రకాల సేవలు, దర్శనాలు, రుసుముతో వసతి, ఆశీర్వచనాలు అందిస్తోంది. భక్తాగ్రేసరులకు పెద్దపీట వేసే క్రమంలోనే ఈ సదుపాయాలన్నీ కల్పిస్తామని పేర్కొనే దేవస్థానం అధికారులు, పాలకులు అమల్లో మాత్రం తూతూ మంత్రంగా వ్యవహరిస్తూ వారిని నిరాశకు గురిచేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో టీడీడీ తీసుకొస్తున్న అసంబద్ధ సంస్కరణలు ఎందుకోసం.. ఎవరికోసం..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## గతంలో ఇలా..!

రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు విరాళంగా అందించే వారికి, ఏడాదికి ఒకసారి సుపథం ద్వారా దర్శనం, ఒకరోజు వసతి సదుపాయం, ఆరు చిన్న లడ్డూలను అందిస్తున్నారు. వీరికి ఒక దుప్పటి, జాకెట్ ముక్క బహుమానంగా ఇస్తారు. రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చిన భక్తులకి ఏడాదిలో మూడుసార్లు సుపథం ద్వారా దర్శనం. మూడు రోజుల పాటు వసతి. పది చిన్నలడ్డూలు, ఐదు మహా ప్రసాదాలు అందిస్తున్నారు. అలాగే దుప్పటి, జాకెట్ ముక్క బహుమానంగా ఇస్తున్నారు. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చే భక్తులకు ఏడాదిలో మూడుసార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనం. మూడు రోజుల వసతి, 20 చిన్నలడ్డూలు, 10 మహా ప్రసాదాలు అందిస్తున్నారు. దుప్పటి, జాకెట్ ముక్క, వెండినాణెం (50 గ్రాములు) ఇస్తున్నారు. రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు విరాళం అందించే భక్తులకు ఏడాదికి మూడుసార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనం. ఒకసారి సుపథం ద్వారా అవకాశం కల్పిస్తారు. మూడు రోజుల వసతి, పెద్దలడ్డూలు నాలుగు, చిన్నలడ్డూలు 5, మహా ప్రసాదాలు 10 అందజేస్తున్నారు. ఒక దుప్పటి, జాకెట్ ముక్క, ఐదు గ్రాముల బంగారు నాణెం, 50 గ్రాముల వెండి నాణెం అందజేస్తున్నారు. రూ. 50 లక్షల నుంచి రూ. 75 లక్షలు విరాళంగా అందించే భక్తులకు ఏడాదిలో ఒకరోజు (ఐదుగిరికి) సుప్రభాత సేవ, మూడుసార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనం, రెండుసార్లు సుపథం ద్వారా దర్శనం కల్పిస్తున్నారు. మూడు రోజుల వసతి, ఆరు పెద్ద లడ్డూలు, 10 చిన్నలడ్డూలు, 10 మహా ప్రసాదాలు అందజేస్తున్నారు. బహుమానంగా 5 గ్రాముల బంగారు నాణెం, 50 గ్రాముల వెండినాణెం, రూ. 75 లక్షల నుంచి రూ. కోటి వరకు విరాళం ఇచ్చే భక్తులకు ఏడాదిలో రెండుసార్లు (ఐదుగురికి) సుప్రభాత సేవ, మూడు బిగినింగ్ బ్రేక్ దర్శనాలు, మూడుసార్లు సుపథం ద్వారా స్వామి దర్శనం కల్పిస్తున్నారు. మూడు రోజుల వసతి, ఎనిమిది పెద్ద లడ్డూలు, 15 చిన్న లడ్డూలు 10 మహా ప్రసాదాలు, ఒక దుప్పటి, జాకెట్ ముక్క, 5 గ్రాముల బంగారు నాణెం, 50 గ్రాముల వెండి నాణెం అందజేస్తున్నారు. రూ. కోటికి పైగా విరాళాలు అందించే భక్తులకు ఏడాదిలో మూడుసార్లు (ఐదుగురి చొప్పున) సుప్రభాత సేవ, మూడు బిగినింగ్ బ్రేక్ దర్శనాలు, నాలుగుసార్లు సుపథం ద్వారా దర్శనం కల్పిస్తున్నారు. ఒక దుప్పటి, జాకెట్ ముక్క, ఏడాదిలో ఒకసారి వేద ఆశీర్వచనం, ఐదు గ్రాముల బంగారు నాణెం, 50 గ్రాముల వెండి నాణెం ఇస్తున్నారు. ఇవన్నీ దాత జీవితకాలానికి సంబంధించి అందేలా టీటీడీ వ్యవహరిస్తోంది.

## కొత్త నిబంధనల పేరుతో సౌకర్యాల కోత...!

ఇక జూలై 15 నుంచి టీటీడీ తీసుకొచ్చిన కొత్త నిబంధనల్లో భాగంగా.. వ్యక్తిగత విరాళాలు అందించే దాతలకు సేవా సదుపాయాల కల్పనను 20 ఏళ్లకే, ట్రస్టులు, సంస్థల తరపున అందే విరాళాలకు సంబంధించిన సౌకర్యాల కల్పనను 15 ఏళ్లకే పరిమితం చేసింది. ప్రస్తుతం టీటీడీకి 1.90 లక్షల మంది దాతలు ఉన్నారు. వీరిలో రూ. 1.50 లక్షల మంది రూ.లక్ష, 22 వేల మంది రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. కొత్త పాలసీ ప్రకారం విరాళం ఇచ్చే దాతలను కేటగిరీలుగా విభజించారు. ఒక్కో సేవకు ఐదుగురి చొప్పున అనుమతిస్తారు. ఇకపై రూ.లక్ష విరాళం ఇస్తే ఏడాదికి ఒకసారి ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉంటుంది. రూ. 2 లక్షల విరాళం ఇస్తే ఏడాదికి ఒకసారి సుపథం ద్వారా ప్రవేశం కల్పిస్తారు. రూ.3 లక్షలు ఇస్తే ఏడాది ఒకసారి ఒక సుపథం, ఒక ప్రత్యేక ప్రవేశ దర్శనం అందేలా చూస్తారు. రూ.4 లక్షలు విరాళం ఇస్తే ఏడాదికి రెండుసార్లు సుపథం, రెండుసార్లు ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉంటుంది. రూ. 5 లక్షల విరాళం అందిస్తే ఏడాదికి మూడుసార్లు సుపథం, మూడుసార్లు ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పిస్తారు. ఇక సంస్థలు, ట్రస్టులు రూ. లక్ష విరాళం ఇస్తే ఏడాదికి ఒకసారి ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉంటుంది. రూ. 2 లక్షలు ఇస్తే ఏడాదికి ఒకసారి సుపథం దర్శనం ఉంటుంది. రూ. 3 లక్షలకు ఏడాదికి ఒకసారి సుపథం, ఒకసారి ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పిస్తారు. రూ. 4 లక్షల విరాళం ఇస్తే రెండుసార్లు సుపథం దర్శనాలు, ఒకసారి ప్రత్యేక ప్రవేశ దర్శన అవకాశమిస్తారు. రూ. 5 లక్షలు అందించే వారికి 2 సార్లు సుపథం, 2 సార్లు ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉంటుంది. ఇక విరాళం స్థాయిని బట్టీ ఏడాదికి 1 నుంచి 3 రోజుల పాటు వసతి సౌకర్యం టీటీడీ కల్పిస్తుంది. ఏడాదికి 5 నుంచి 10 చిన్న లడ్డూలు, పట్టు దుప్పటి, జాకెట్ పీస్ అందజేస్తారు. అలాగే రూ. 10 లక్షల విరాళం అందించే భక్తులకి ఏడాదికి ఒకసారి సుపథం, ఒకసారి బిగినింగ్ బ్రేక్ దర్శనం ఉంటుంది. రూ. 15 లక్షల విరాళం అందించే భక్తులకి ఏడాదికి ఒకసారి బిగినింగ్ బ్రేక్ దర్శనం. 2సార్లు సుపథం దర్శనం ఉంటుంది. రూ. 20 లక్షలు ఇచ్చిన భక్తులకి ఏడాదికి మూడుసార్లు సుపథం. 2 బిగినింగ్ బ్రేక్ దర్శనాలు కల్పిస్తారు. రూ. 25 లక్షల విరాళం ఇచ్చే భక్తులకి 3 బిగినింగ్ బ్రేక్ దర్శనాలు, 3 సుపథం దర్శనాలు ఉంటాయి. ఇక ట్రస్టులు, సంస్థల విషయానికి వస్తే రూ.10 లక్షల విరాళం ఇస్తే ఒక బ్రేక్ దర్శనం. రూ.15 లక్షల విరాళమిస్తే ఒక బ్రేక్, ఒక సుపథం దర్శనం ఉంటుంది. రూ.20 లక్షల విరాళం ఇస్తే ఏడాదికి రెండు బ్రేక్ దర్శనాలు, ఒక సుపథం, ఒక ఎస్ఈడీ దర్శనం ఉంటుంది. రూ. 25 లక్షలు ఇచ్చే వారికి ఏడాదికి 3 సార్లు బ్రేక్, రెండు సుపథం, ఒక ఎస్ఈడీ దర్శనం కల్పిస్తారు. వీరికి ఒకటి లేదా రెండు రోజుల పాటు వసతి సౌకర్యం, ఏడాదికి 15 చిన్నలడ్డూలు, పట్టు దుప్పట, జాకెట్ పీస్ అందిస్తారు. రూ. 50 లక్షలు ఆపై విరాళాలు ఇచ్చే వారికి ఇచ్చే బంగారు, వెండి నాణేల బరువుల్లో మార్పులు చేశారు. ఇక వీరికి సుప్రభాతం, కల్యాణోత్సవం వంటి సేవలను కేటాయించారు. రూ. 50 లక్షల విరాళం ఇస్తే ఏడాదికి మూడుసార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనం. 4సార్లు సుపథం, జీవితకాలంలో 10 సార్లు సుప్రభాత సేవ, రెండు కల్యాణోత్సవాలు కల్పిస్తారు. కల్యాణోత్సవంలో ఇద్దరు పాల్గొనవచ్చు. రూ.75 లక్షల విరాళం అందిస్తే.. ఏటా మూడుసార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనం. నాలుగు సార్లు సుపథం, జీవితకాలంలో 12 సార్లు సుప్రభాత సేవ. రెండుసార్లు కల్యాణోత్సంలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఇక సంస్థలు, ట్రస్టులు రూ. 50 లక్షల విరాళం అందజేస్తే ఏటా రెండుసార్లు బిగినింగ్ బ్రేక్, నాలుగుసార్లు సుపథం దర్శనం, ఒక సుప్రభాత సేవ, 2 కల్యాణోత్సవ సేవల్లో అవకాశం కల్పిస్తారు. రూ.75 లక్షల విరాళం అందజేస్తే.. ఏటా రెండుసార్లు బిగినింగ్ బ్రేక్, 4 సార్లు సుపథం, 2 సార్లు సుప్రభాత సేవ, ఒకేసారి రెండు కల్యాణోత్సవాల్లో పాల్గొనే వచ్చు. ఏడాదిలో మూడు రోజులు వసతి సౌకర్యం కల్పిస్తారు. ఏడాది 15 నుంచి 20 చిన్న లడ్డూలు, 5 నుంచి 7 పెద్దలడ్డూలు, పట్టు వస్త్రాలు అందజేస్తారు. రూ.కోటి విరాళానికి ఏటా 3 సార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనం, 4 సార్లు సుపథం దర్శనం, జీవితకాలంలో 20 సార్లు సుప్రభాత సేవ, ఒకేసారి 3 కల్యాణోత్సవం సేవల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. రూ. 1.5కోట్లు, అంతకంటే ఎక్కువ మొత్తం విరాళంగా అందించే వారికి ఏటా 4సార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనం, 4సార్లు సుపథం. జీవితకాలంలో 40 సార్లు సుప్రభాత సేవ, ఒకేసారి 5 కల్యాణోత్సవ సేవల్లో పాల్గొనవచ్చు. సంస్థలు, ట్రస్టులు ఇచ్చే రూ. కోటి విరాళానికి ఏటా 3సార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనం, 4సార్లు సుపథం దర్శనం, 2 సార్లు సుప్రభాత సేవ, ఒకేసారి మూడు కల్యాణోత్సవాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. రూ.2 కోట్లు అంత కంటే ఎక్కువ విరాళం అందిస్తే.. ఏటా 4 సార్లు బిగినింగ్ బ్రేక్, 4 సార్లు సుపథం దర్శనం, 4 సార్లు సుప్రభాత సేవ, ఒకేసారి 5 కల్యాణోత్సవాలు ఉంటాయి. ఏడాదికి 3 నుంచి 4 రోజుల వసతి సౌకర్యం కల్పిస్తారు. 20 నుంచి 30 చిన్న లడ్డూలు, 10 నుంచి 20 పెద్దలడ్డూలు, పట్టువస్త్రాలు, 2 గ్రాముల బంగారు డాలర్, 10 గ్రాముల వెండి నాణెం ఇస్తారు. ఇవన్నీ కొత్త నిబంధనలు. విరాళాలు ఇవ్వదలచిన భక్తులని ప్రోత్సహించవలసిందిపోయి నిరుత్సాహ పరచే విధంగా ఈ కొత్త నిబంధనలు ఉన్నాయని భక్తులు వాపోతున్నారు.

## బరువు మార్చి.. భక్తులను ఏమార్చి!

విరాళాలు ఇచ్చే భక్తులకు గతంలో 5గ్రాముల బంగారు నాణెం, 50 గ్రాముల వరకు వెండి నాణెం అందజేస్తుండగా, ఇప్పుడు వాటి బరువును 2 గ్రాములకు, 10 గ్రాములకు పరిమితం చేశారు. అలాగే ఇప్పటి వరకు జీవితకాల దర్శన సదుపాయాన్ని కల్పిస్తుండగా తాజాగా 20 సంవత్సరాలకు, 15 సంవత్సరాలకు కుదించారు. ఇక స్వామి ప్రసాదాలు, చిన్నలడ్డూలు, పెద్ద లడ్డూలు, మహా ప్రసాదాలు వంటి వాటి సంఖ్యలో కోత విధించారు. అన్నింటికంటే ముఖ్యంగా స్వామిని దర్శించుకునే సమయంలో దాతలకు ఇప్పటి వరకు మొదటి గడప (కులశేఖరపడి) నుంచి దర్శనం కనిపిస్తుండగా ఇకపై సాధారణ భక్తులతో కలిపి రెండవ గడప (రాములవారి మేడ) నుంచి దర్శనం కల్పించాలని నిర్ణయించారు. అంటే సాధారణ భక్తులగే వీరికి కూడా ఇకపై లఘు దర్శనం అమలు చేస్తారు. ఫలితంగా స్వామిపై ఎంతో భక్తి ప్రపత్తులతో విరాళం ఇచ్చి స్వేచ్ఛగా, సంపూర్ణంగా స్వామిని దగ్గర నుంచి దర్శించుకునే అవకాశం కోల్పోయామంటూ దాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రజాప్రతినిధులు, న్యాయశాఖకు సంబంధించిన అధికారులు, ఐఎఎస్‌లు, ఐపీఎస్‌లు మాత్రం స్వామిని అత్యంత దగ్గరగా ప్రోటోకాల్‌తో దర్శించుకునే అవకాశం టీటీడీ కల్పిస్తోంది. వారిని మూలవిరాట్‌కు అత్యంత దగ్గరగా ఉండే ప్రధాన గర్భాలయం నుంచే స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, బోర్డు సభ్యులతో పాటు ఇతరులు సిఫార్సు చేసే వారితో పాటు శ్రీవారిపై ఎంతో భక్తితో విరాళం ఇచ్చే వారికి సైతం మొండిచేయే మిగులుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## రూ.3000కి లభిస్తున్న రూ.300 టిక్కెట్లు! క్షణాల్లో కరిగిపోతున్న శ్రీవాణి కోటా!

ఇక రూ. 300 దర్శన టికెట్లను పప్పు బెల్లాల్లా యథేచ్ఛగా బ్లాక్‌లో విక్రయిస్తుండడం టీటీడీ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే శ్రీవాణి కోటా కూడా క్షణాల్లో కరిగిపోయి కనుమరుగైపోతుందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు లడ్డూ ప్రసాదాల విక్రయాల్లోనూ, తలనీలాలు, పూజా సామాగ్రి విక్రయాల్లోనూ భారీగా అవకతవకలు చోటుచేసుకుంటుండడం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా పాలకమండలి సభ్యులు, ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని భక్తులు, దాతలకు పెద్దపీట వేసి స్వామి దర్శనభాగ్యంతో పాటూ లడ్డూ ప్రసాదాలు, వసతి సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాల్సి ఉంది. ముఖ్యంగా విరాళాలిచ్చిన వారికి తగిన గౌరవం ఇచ్చి స్వామి సేవలో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు, విశ్లేషకులు టీటీడీకి సూచిస్తున్నారు. ఇక జూలై 15న కొత్త నిబంధనలు తెచ్చిన అధికారులు, పాలకమండలి సభ్యులు తమవారికి మాత్రం ముందస్తుగా సమాచారం అందించి పెద్దఎత్తున విరాళాలు సేకరించి స్వామి దర్శన భాగ్యాన్ని జీవితకాలం పొందేందుకు స్కెచ్ వేయడం అన్యాయం అంటూ ఆరోపిస్తున్నారు . ఏదేమైనా ఎంతో భక్తితో విరాళం అందించే భక్తుల మనస్సు నిండేలా శ్రీవారి దర్శించే భాగ్యాన్ని ప్రసాదించడం టీటీడీ కర్తవ్యం అనడంలో సందేహంలేదు. మరి కొత్త నిబంధనలు శాశ్వతమా లేక రద్దీ నేపథ్యంలో తాత్కాలికమా అన్న విషయాన్ని సైతం స్పష్టం చేయాల్సిన బాధ్యత టీటీడీదే.

ఒక్కటి మాత్రం నిజం ఏడుకొండల వాడు.. అందరివాడు.. అందరికీ అందేవాడు.. అనేలా వ్యవహరించాల్సిన బాధ్యత, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి మరియు రాష్ట్రప్రభుత్వానిదే అన్న విషయం ఎవరూ విస్మరించకూడదు. తమకున్న విచక్షణాధికారాలతో అర్థరహిత నిర్ణయాలు తీసుకుంటున్న స్వార్థపూరిత వ్యక్తులని, దొరికినకాడికి దోచుకోవాలని చూసే స్వాహారాయుళ్లని ఆ దేవదేవుడు క్షమించదన్నది మాత్రం అందరూ గుర్తు పెట్టుకుని వ్యవహరించాలని భక్తులు హెచ్చరిస్తున్నారు.

ఓం నమో వెంకటేశాయ...!

# పెంచలకోనలో.. స్వాతి నక్షత్ర వేడుకలు

రాపూరు మండలం, పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ఈ నెల 22న ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం నృసింహ యాగం జరిగింది. ఆ తర్వాత భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారికి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకలకు తరలివచ్చారు. ఆలయ ఉపకమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

# 'పల్లె వీక్షణ'.. సమస్యల సాధన!

- వెంకటాచలం మండలంలో కలెక్టర్, ఎమ్మెల్యే సోమిరెడ్డిల పర్యటన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 23న గురువారం నాడు వెంకటాచలం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడమే 'పల్లె వీక్షణ' ప్రధాన లక్ష్యమన్నారు. తొలుత వారు వెంకటాచలం సమీపంలోని వడ్డిపాలెంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు, మౌలిక వసతులను తనిఖీ చేసి వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని సూచించారు. వీరన్న కనుపూరు చెరువును ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల సంభవించిన తుఫానుల కారణంగా దెబ్బతిన్న వీరన్న కనుపూరు చెరువుకు రూ.47 లక్షలతో చేపట్టిన పునరుద్ధరణ పనులను పరిశీలించి, నాణ్యతతో పూర్తి చేసిన ఇరిగేషన్ అధికారులను అభినందించారు. పశుసంవర్ధక శాఖ నిర్వహించిన కృత్రిమ గర్భధారణ ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈనెల 24న జిల్లావ్యాప్తంగా జరగనున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారుల మరమ్మతులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు.

# మెదడు ఆరోగ్యం..జాగ్రత్త!



వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న అడిషనల్ ఎస్పీ సౌజన్య

పోలీసు సిబ్బంది తమ విధి నిర్వహణలో ఎంతో మానసిక వత్తిడికి గురవుతుంటారని, ఈ నేపథ్యంలో వారంతా ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా మెదడు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ సిహెచ్ సౌజన్య చెప్పారు. ఈనెల 22న ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా, నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంలో ఆమె పాల్గొని ఆరోగ్యపరీక్షలు చేయించుకున్నారు. ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏఆర్ ఏఎస్పీ అప్పారావు, డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఆసుపత్రి సీఓఓ డాక్టర్ రోహిణి ప్రియలక్ష్మి, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ నిరంకుశత్వం వీడాలి



డీసీసీ నేత నారపరెడ్డి

బీజేపీ నిరంకుశ విధానాలను విడనాడాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈనెల 22న స్థానిక వీఆర్‌సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు కాంగ్రెస్ ర్యాలీగా నాయకులతో కలిసి వచ్చి, బీజేపీ వైఖరికి నిరసన తెలిపారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఒక పెద్ద కుంభకోణమని, ఈ విషయమై ఆందోళన చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పట్ల దురుసుగా ప్రవర్తించడం దారుణమని అన్నారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్ఫాన్, ఉపాధ్యక్షులు బాలసుధాకర్, డాక్టర్ యశోధర, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## తలసీమియా విభాగానికి..

# 2.35 లక్షల విరాళం

నెల్లూరు రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలోని తలసీమియా విభాగానికి పలువురు దాతలు ఈనెల 22న విరాళాలిచ్చారు. నెల్లూరుకు చెందిన శ్రీనివాసన్ చక్రవర్తి కుటుంబ సభ్యులు 2 లక్షలా 5వేల 5 వందల రూపాయలను అందజేయగా, కుసుమ హరనాథ్ భక్తబృందం వారు తలసీమియా యూనిట్‌కి మందుల కొనుగోలుకు 30 వేల రూపాయలు విరాళమిచ్చారు. తలసీమియా చిన్నారులకు అండగా ఉండేందుకు విరాళాలివ్వడం పట్ల ఆ విభాగం నిర్వాహకులు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి మస్తానయ్య, తలసీమియా ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ సీత, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, యాలమూరి రంగయ్యానాయుడు, చమర్తి జనార్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

## కమిషనర్ నందన్

నెల్లూరు నగరంలో భవన నిర్మాణాల కోసం ఇసుకను రవాణా చేసు వాహనదారులు చట్టప్రకారం నడచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నగర కార్పొరేషన్ కమిషనర్ నందన్ హెచ్చరించారు. ఈనెల 22న పొట్టేపాళెం లోడింగ్ పాయింట్ వద్ద.. ఇసుకరీచ్ నుంచి ఇసుకను తీసుకునివెళ్తున్న వాహనదారులతో ఆయన మాట్లాడారు. పరిమితికి మించి ఇసుక లోడింగ్‌తో వాహనాలు నగరంలోకి వస్తున్నాయని, దీంతో ఇసుక రోడ్లపై పడి సమస్యలు వస్తున్నాయని వారికి వివరించారు. ఇసుక తరలింపు సమయంలో ఇసుక కిందపడకుండా తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలన్నారు.



# మంత్రి ఆనంతో.. ఎమ్మెల్యే కోటంరెడ్డి భేటీ

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భేటీ అయ్యారు. నెల్లూరులోని మంత్రి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకుని జిల్లా రాజకీయాలకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు, అపర్ణ బిల్డర్స్ అధినేత చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, బిజెపి నాయకుడు రఘురామరాజు పాల్గొన్నారు.

## 'నీట్' పరీక్షలలో..

# డా.కిషోర్స్ రత్నం విద్యార్థుల విజయభేరీ



ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థినీవిద్యార్థులతో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు

నీట్-2026 ఫలితాలలో నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో విజయభేరీ మోగించారు. టి.లాస్యశ్రీ 523 మార్కులు, డి.దామిని 522, యస్.ధీరజ్ 496, బి.రాజేశ్వరి 475, వి.కిరణ్మయి 465, ఎ.మధుశ్రీ 463, యస్.వైష్ణవి 452, ఎం.కృప 448, ఎ.వెంకటసాయిప్రణీత 440, ఆర్.కార్తీకమాధురీ సింగ్ 438, టి.రితికాషెరల్ 435, ఎస్‌కె మన్హషలాక్ 424, బీ.రీనా ఏంజల్ 423, టి.భావన 420 మార్కుల వంతున సాధించి వివిధ కేటగిరీలలో ఎంబీబీఎస్ సీట్లను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అద్భుత విజయాలు సాధించిన విద్యార్థులందరినీ డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించారు. తమ విద్యాసంస్థల్లో పటిష్టమైన ప్రణాళిక, విశిష్టమైన విద్యాబోధన, నిపుణులైన అధ్యాపక బృందంతో పాటు విద్యార్థుల సమిష్టి కృషితో ఈ అద్భుత విజయాలు సాధించామని వారు తెలిపారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, నీట్ అకడమిక్ హెడ్ రఘుపతినాయుడు, అకడమిక్ అడ్వైజర్ నరసయ్యనాయుడు, ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# 'జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్' ఆవిర్భావం



నెల్లూరు జిల్లాలో జర్నలిస్టులపై జరిగే దాడులు, దౌర్జన్యాలు, వేధింపులను నియంత్రించేందుకు జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ (జేపీఎఫ్) ఆవిర్భవించింది. నెల్లూరులో ఇటీవల జరిగిన జర్నలిస్టుల సమావేశంలో జేపీఎఫ్‌ని ప్రకటించారు. జేపీఎఫ్ గౌరవాధ్యక్షులుగా సీనియర్ పాత్రికేయులు డెక్కన్ క్రానికల్ కరస్పాండెంట్ పి.రాజశేఖర్, కన్వీనర్‌గా ఛానల్-9 వీణ జి.జయరాజు, కో-కన్వీనర్లుగా విశాలాంధ్ర బ్యూరో దయాశంకర్, హెచ్ఎంటీవీ ఇన్‌చార్జి నరసింహులు, 99 టీవీ బ్యూరో ఇంచార్జ్ కె. మురళీకృష్ణ, వార్త జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్ర, ఎన్-3 ఛానెల్ వీణ సునీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జిల్లా ఇంచార్జ్‌లు కొనసాగనున్నట్లు వారు తెలిపారు. జిల్లాలో జర్నలిస్టులకు జేపీఎఫ్ అండగా ఉంటుందని, ఏ జర్నలిస్టుకైనా అన్యాయం జరిగితే వారి తరపున పోరాడుతుందని వివరించారు.




NAME : CELL : ADDRESS :

లాయర్
జులై 24, 2026

# కరోనా కలకలం.. ప్రజల్లో కలవరం!

కరోనా పీడ ఇంకా విరగడ కాలేదు. ఎప్పటికప్పుడు కొత్త రూపాలెత్తి ప్రజల ప్రాణాలమీదికి వస్తూనే ఉంది. తగ్గిపోయిందిలే అనుకుంటున్న తరుణంలో.. 'తగ్గేదే లే' అంటూ వికటాట్టహాసం చేస్తూనే ఉంది. తాజాగా, మళ్ళీ కరోనా వస్తున్నదనే వార్తలు సర్వత్రా కలవరం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కరోనా కేసులు రావడంతో మళ్ళీ కరోనా విజృంభిస్తుందేమోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. గతంలో రెండుసార్లు కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రజలను బలి తీసుకున్న నేపథ్యంలో, కరోనా మాటెత్తితేనే ప్రజలు హడలిపోతున్నారు. కంటికి కనిపించని సూక్ష్మ క్రిమి రూపంలో వచ్చే ఈ కరోనా వ్యాధి, తగ్గిపోయినట్లు అనిపించినా, రకరకాల రూపాల్లో (వేరియంట్లు) గాలిలో సంచరిస్తూ ఉంటోందని, ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండక తప్పదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసుల సంఖ్య ఈనెల 20వ తేదీ నాటికి 19కి చేరడం, అందులో నలుగురు మృతిచెందడంతో ప్రభుత్వంతో పాటు, వైద్యరంగం అప్రమత్తమైంది. ఈ నెల 21న ఒకేరోజు 7 కేసులు నమోదయ్యాయి. గుంటూరులో 4, తూర్పు గోదావరిలో 2, బాపట్లలో 1 కేసు నమోదై మొత్తంగా కరోనా బాధితుల సంఖ్య 26కి చేరడం ఆందోళన కలిగిస్తోంది. కరోనా పాజిటివ్ కేసుల నమూనాలను వైద్యులు పుణేలోని పరిశోధన కేంద్రానికి పంపారు. అక్కడ పరీక్షించాక అది 'ఒమిక్రాన్ ఆర్ఎఫ్-5 వేరియంట్' అని తేలడంతో, కరోనా వ్యాధి ప్రబలకుండా ప్రభుత్వం మరింత గట్టిచర్యలకు ఉపక్రమించింది. కరోనా కేసులను గుర్తించడానికి, అవసరమైన కిట్‌లు, మందులు ఇతర సదుపాయాలు సమకూర్చేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ కరోనా పరీక్షలకు, అత్యవసర చికిత్సలకు ఏర్పాట్లు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్రలో కూడా అక్కడక్కడా కోవిడ్ కేసులు కనిపించినా స్వల్ప లక్షణాలే కనిపించాయని, కనుక కరోనా వేరియంట్ల గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని చెప్తున్నారు. అయితే, ఎందుకైనా మంచిదని, కీడెంచి మేలెంచడమే మేలని ముందు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని కూడా స్పష్టం చేస్తున్నారు. ఏమాత్రం ఈ వ్యాధి లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 60 ఏళ్ళకు పైబడిన వృద్ధులు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ వ్యాధులు, క్యాన్సర్, మధుమేహం ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, గర్భిణులు ఈ వ్యాధి పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. కోవిడ్ వైరస్ పూర్తిగా అంతరించిపోలేదని, అప్పుడప్పుడు ఇలా కొత్త వేరియంట్లు వస్తూనే ఉంటాయని, మన దేశంతో పాటు అనేకదేశాల్లో కూడా ఇప్పటికే టీకాలు ప్రభావం, రోగనిరోధకశక్తి కొంతమేరకు పెరగడంతో తీవ్రమైన అనారోగ్యాలు రాకపోవచ్చని కూడా భావిస్తున్నారు.

తొలిసారిగా 2019లో కరోనా వైరస్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. సంక్షిప్తంగా 'కోవిడ్-19'గా దానికి పేరు. చైనాలోని వూహాన్ నగరంలో ప్రారంభమై, 2020 జనవరి 30న మనదేశంలోకి కూడా ఈ రాకాసి జొరబడింది. శ్వాసకోశ వ్యవస్థను దెబ్బతీస్తూ పెద్దఎత్తున మరణాలకు సైతం దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాల్లోనూ విజృంభించడం, లక్షల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఆ తర్వాత 2021 ఏప్రిల్, మే నెలల్లో మనదేశంలో రెండోసారి కరోనా విపరీతంగా సోకి, అత్యంత వేగంగా వచ్చింది. మరణాలు కూడా మరింత భారీగా పెరిగాయి. మళ్లీ 2022లోలో కరోనా ఒమిక్రాన్ వేరియంట్ థర్డ్ వేవ్‌గా వచ్చినా, స్వల్పకాలంలోనే సమసిపోవడంతో పెద్ద ఉపద్రవమే తప్పింది. తాజాగా ఇప్పుడు నాలుగోసారి మనం కరోనా వేరియంట్‌ల మాట వింటున్నాం. అక్కడక్కడా కేసులు వస్తున్నాయి. మరణాలు కూడా సంభవిస్తున్నాయి. కాబట్టి తేలిగ్గా తీసుకోలేం. వేగంగా గాలిద్వారా వ్యాపించే మహమ్మారి వ్యాధి ఇది. గత అనుభవాల దృష్ట్యా దీనిని నమ్మలేం. ఎప్పుడు ఎలా విరుచుకుపడుతుందో తెలియదు. కనుక, ప్రస్తుత పరిస్థితుల్లో ముందు జాగ్రత్తలే దీనికి మందు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసటతో పాటు, మనం తినే ఆహారం రుచి, వాసన కూడా తెలియని స్థితి వంటివి కరోనా ప్రాథమిక లక్షణాలు. ఈ వ్యాధి సోకిన వారు తుమ్మినా, దగ్గినా, మాట్లాడినా గాలిలో ఆ తుంపర్లు కలసిపోయి ఇతరులకు సోకుతుందని తెలిసిందే కదా!.. ఇవన్నీ గుర్తుంచుకుని, అనునిత్యం వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించడం వంటి జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించడం అన్ని విధాలా శ్రేయస్కరం!...

# విజయవాడ-బెంగళూరు వందే భారత్ కోసం వెంకయ్యనాయుడు గారు చొరవ చూపాలి!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

విజయవాడ-బెంగళూరు మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్నట్లు గతంలో రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రతిపాదిత వివరాల ప్రకారం ఈ రైలుకు 20711/20712 నంబర్లు కేటాయించినట్లు, విజయవాడ నుంచి ఉదయం 5.30 గంటలకు బయలుదేరి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు మీదుగా బెంగళూరుకు మధ్యాహ్నం సుమారు 2.00 గంటలకు చేరుకునేలా ప్రయాణ వేళలపై కూడా పత్రికలలో, సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్త వచ్చి చాలాకాలం గడిచినా ఇప్పటి వరకు రైలును ప్రారంభించ లేదు. దీంతో విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాదిమంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, భక్తులు బెంగళూరుకు ప్రయాణిస్తుంటారు. వందే భారత్ అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు సౌకర్యవంతమైన, వేగవంతమైన రవాణా లభిస్తుంది.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారు ఈ అంశంపై ప్రత్యేక చొరవచూపి కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్‌తో చర్చించి, ఇప్పటికే ప్రకటించిన విజయవాడ-బెంగళూరు వందే భారత్ రైలును వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. నెల్లూరు, ఒంగోలు, తిరుపతి పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ గురుమూర్తితో పాటు ఆయా జిల్లాలోని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, వై.వి.సుబ్బారెడ్డి తదితర నేతలు కూడా ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి స్పందించాలి. అలాగే దక్షిణమధ్య రైల్వే అధికారులు కూడా ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చి ఈ రైలును వెంటనే పట్టాలెక్కించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

బి. హేమంత్‌కుమార్‌రెడ్డి, బెంగళూరు.

# భయపెడుతున్న కొత్త కరోనా - తస్మాత్ జాగ్రత్త

మన రాష్ట్రంలో కడప జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చిన కొత్త కరోనా కేసులు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కడపతో పాటు మరి కొన్ని ప్రాంతాలలో కూడా స్వల్ప సంఖ్యలో కేసులు నమోదైనట్లు సమాచారం. అధికారిక వార్తల ప్రకారం నలుగురు మరణించినట్లు కూడా తెలుస్తోంది. బాధితుల్లో ఎక్కువమంది తక్కువ లక్షణాలతోనే ఉన్నప్పటికీ, ఆరోగ్య శాఖ వారిని పర్యవేక్షిస్తూ అవసరమైన చికిత్స అందిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరం. అనవసర భయాందోళనలకు గురికాకుండా, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం, రద్దీ ప్రదేశాల్లో అవసరమైతే మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వ ఆరోగ్య శాఖ సూచనలను పాటిస్తే కరోనా వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చు. "జాగ్రత్తే రక్షణ" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

- డాక్టర్ పెంచలరెడ్డి, నెల్లూరు.

# జల ఖడ్గానికి భారత్ పదును

మనసులో మాట 107

దశాబ్దాల తరబడి అంతర్జాతీయ సమాజంలో భారతదేశం ఒక బాధ్యతాయుతమైన, సహనశీలమైన ఎగువ పరివాహక ప్రాంతంగా పేరు తెచ్చుకుంది. 1960లో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంలో కుదిరిన సింధూ జలాల ఒప్పందం ఈ సహనానికి, దాతృత్వానికి నిదర్శనం. భారత్-పాకిస్థాన్‌ల నడుమ యుద్ధాలు జరిగినా, దాయాది దేశం సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్నా, నిరంతర దౌత్యపరమైన ఉద్రిక్తతలు చోటుచేసుకున్నా సరే.. నదీ జలాల విషయంలో భారత్ చూపిన ఉదారత ప్రపంచ చరిత్రలోనే అరుదైనది. దాయాది దేశపు నాయకుల కుటిల బుద్ధికి ఆ దేశ ప్రజలు ఇబ్బంది పడకూడదనే మానవత్వమే సింధూ జలాల పంపిణీకి కారణం. అయితే, ఈ ఏకపక్ష నైతికతకు, ఉదారతకు ఇక కాలం చెల్లిందని భారత్ ఇటీవల కచ్చితమైన విదేశాంగ వైఖరి ద్వారా చాటిచెప్పింది. "పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదాన్ని పూర్తిగా విరమించుకోనంత వరకు, 1960 నాటి పాత రూపంలో సింధూ ఒప్పందం పునరుద్ధరించే ప్రసక్తే లేదు"అని భారత్ ఇటీవల జారీ చేసిన ప్రకటన ఒక సాధారణ హెచ్చరిక కాదు; అది దక్షిణాసియా భౌగోళిక-రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి నాంది. పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలను, చట్టపరమైన మార్గాలను తన స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణం. జమ్మూ జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిరోధించడానికి పాకిస్థాన్.. ఒప్పందంలోని వివాద పరిష్కార వ్యవస్థను భ్రష్టు పట్టించింది. ఒప్పందంలోని ఆర్టికల్ 9 ప్రకారం- ముందుగా 'తటస్థ నిపుణుడి' విచారణను కోరిన పాకిస్తాన్, ఆ ప్రక్రియ సాగుతుండగానే సమాంతరంగా ది హేగ్ లోని 'శాశ్వత ఆర్బిట్రేషన్ కోర్టు' ను ఆశ్రయించింది. ఒకే వివాదంపై రెండు వేర్వేరు అంతర్జాతీయ సంస్థలను రంగంలోకి దింపి భారత్‌ను బోనెక్కించాలని చూసింది. ఒప్పందంలోని నిబంధనలకు ఇది పూర్తిగా విరుద్ధం. అందుకే, అక్రమంగా ఏర్పాటైన ఆర్బిట్రేషన్ కోర్టు విచారణలను బహిష్కరిస్తూనే, తటస్థ నిపుణుడి ప్రక్రియకు భారత్ సహకరించింది. చట్టపరమైన ప్రక్రియలను పక్కదారి పట్టించే పాకిస్థాన్ వ్యూహాలకు భారత్ ఈ నిర్ణయంతో గట్టి అడ్డుకట్ట వేసింది. 1960 నాటి ఇంజనీరింగ్ ప్రమాణాలు, అప్పటి జనాభా అవసరాలు, పరిమిత వనరుల ఆధారంగా ఆ ఒప్పందం కుదిరింది. కానీ గడచిన 65 ఏళ్లలో హిమానీనదాలు వేగంగా కరిగిపోవడం, నదీ ప్రవాహ మార్గాలు మారడం, మారుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒప్పందాన్ని తిరగరాయాలని భారత్... పాకిస్థాన్‌కు అధికారికంగా నోటీసులు పంపింది.

ఈ విషయంపై కనీసం చర్చలకు కూర్చోవడానికి కూడా పాకిస్థాన్ మొండిగా నిరాకరించింది. సవరణలకు సిద్ధపడకపోతే ఒప్పందాన్ని కొనసాగించడం ఏకపక్ష భారం మోయడమే అవుతుందని భారత్ భావించింది.

మరోవైపు పహల్గామ్ దారుణ ఉగ్రవాద దాడి భారత దౌత్యంలో సరికొత్త పరిణామానికి దారితీసింది. వియన్నా ఒడంబడికలోని నిబంధనల ప్రకారం-ఒక ఒప్పందానికి పునాది అయిన శాంతిభద్రతలను, నమ్మకాన్ని ఒక దేశం ఉగ్రవాదం ద్వారా విచ్ఛిన్నం చేస్తే, బాధితుడైన రెండో దేశానికి ఒప్పంద బాధ్యతలను తాత్కాలికంగా నిలిపివేసే పూర్తి హక్కు ఉంటుంది. పాకిస్థాన్ ఒకవైపు పరోక్ష యుద్ధంద్వారా భారత భూభాగంలో నెత్తురు పారిస్తూ, మరోవైపు 'సింధూ ఒప్పందం' వెనుక దాక్కుని నీటి హక్కులను కోరడాన్ని భారత్ ఇకపై సహించబోనని స్పష్టం చేసింది.

అంతర్జాతీయ వేదికలపై "భారత్ నీటిని ఆపేస్తోంది" అని పాకిస్థాన్ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. సింధూ పరివాహక ప్రాంతం నుండి ఆ దేశానికి లభించే నీటిలో దాదాపు 35 మిలియన్ ఎకరా ఫీట్ల(MAF) నీరు ఎలాంటి వినియోగం లేకుండా నేరుగా అరేబియా సముద్రంలో వృథాగా పోతోంది. 1970ల తర్వాత పాకిస్థాన్ తన దేశంలో ఒక్క ఆధునిక డ్యామ్‌ను కానీ, సామర్థ్యం గల కాలువల వ్యవస్థను కానీ నిర్మించలేకపోయింది. కాబట్టి ఆ దేశం ఎదుర్కొంటున్నది 'భారత్ సృష్టించిన కొరత' కాదు; తమ సొంత పరిపాలనా వ్యవస్థ వైఫల్యం, స్వయంకృత అపరాధం. సింధూ జలాల ఒప్పందం రద్దు కాకపోయినా, అది 1960 నాటి పాత రూపంలోకి తిరిగి రాదనేది పచ్చి నిజం. ఒప్పందాన్ని నిలిపివేసిన ఈ సమయంలో భారత్ జమ్మూ కాశ్మీర్‌లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పకల్ దుల్ (1,000 MW), రత్లే (850 MW), కిరు (624 MW), క్వార్ (540 MW) మరియు సవాల్కోట్ (1,856 MW) వంటి ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తోంది. రాబోయే ఐదేళ్లలో వీటి ద్వారా దాదాపు 5,300 మెగావాట్లకు పైగా క్లీన్ ఎనర్జీని సాధించడమే కాకుండా, పశ్చిమ నదుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి కావలసిన నిల్వ మౌలిక వసతులను భారత్ బలోపేతం చేస్తోంది.

ఇటీవల కెనడా విదేశాంగ మంత్రి పాకిస్థాన్ పర్యటనకు వచ్చినప్పుడు, పాకిస్థాన్ ఉపప్రధాని ఇషాక్ దార్ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించేలా భారత్‌పై ఒత్తిడి తేవాలని కెనడా సహాయాన్ని అర్థించడం ఆ దేశ దౌత్యపరమైన దివాలాకోరుతనానికి నిదర్శనం. కెనడా వంటి మూడో దేశాన్ని ఇందులోకి లాగడం వల్ల భారత్ తన నిర్ణయాన్ని మార్చుకుంటుందని అనుకోవడం పాక్ భ్రమ. సరిహద్దుల్లో తుపాకుల మోత ఆగి, ఉగ్రవాద స్థావరాలు అంతమొంది, నూతన సాంకేతిక, పర్యావరణ ప్రమాణాలతో చర్చలకు వస్తే తప్ప.. పాకిస్థాన్ మళ్లీ పాత లబ్ధిని ఆశించలేదు. "సరిహద్దుల్లో శాంతి లేనిదే, నదులలో నీటి పంపిణీ సాధ్యపడదు" అనే స్పష్టమైన, తార్కికమైన సందేశాన్ని భారత్ ప్రపంచానికి స్పష్టంగా చాటిచెప్పింది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# అభివృద్ధి-సంక్షేమంలో ప్రభుత్వం ముందడుగు

## • మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి


త్రీఫేస్ కరెంట్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం వచ్చాక కీలక శాఖలు మళ్ళీ గాడిలో పడుతున్నాయని, రాష్ట్ర అభివృద్ధి-సంక్షేమంలో తమ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన మనుబోలు మండలం బండేపల్లి, చెర్లోపల్లి గ్రామాలను సందర్శించారు. చెర్లోపల్లిలో రూ. 1.05 కోట్లు, బండేపల్లిలో రూ.48లక్షలతో పూర్తి చేసిన ఆర్డీఎస్ఎస్ పనులతో పాటు, రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో కీలకమైన వ్యవసాయ, ఇరిగేషన్, ఆర్&బీ శాఖలను మూతేశారని, అసెంబ్లీ సాక్షిగా ఆమోదించిన బడ్జెట్ కేటాయింపుల్లో 40 శాతం నిధులు కూడా ఖర్చుపెట్టలేదని విమర్శించారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. సర్వేపల్లిలో రూ.105 కోట్లతో త్రీఫేజ్ విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పనులు పూర్తయిన చోట అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఆర్డీఎస్ఎస్‌తో పాటు జేజేఎం పనులు, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ యూనిట్ల ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా 3 కోట్ల రూపాయల వ్యయంతో మనుబోలు-పొదలకూరు రోడ్డు పనులు చేపట్టామని, సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రోడ్లు బాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

తమకు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని సోమిరెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు వేదాయపాళెంలోని తమ కార్యాలయంలో ఆయన ఇటీవల ప్రజాదర్బార్ నిర్వహించి వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. పలు సమస్యలపై అప్పటికప్పుడే అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ చేపట్టామన్నారు. ప్రజలిచ్చిన ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి నిర్ణీత కాలంలో పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ప్రపంచశాంతిని అందరూ ఆకాంక్షించాలి!

## 'యుద్ధం-శాంతి'..పుస్తకావిష్కరణలో డా. మాడభూషి


'యుద్ధం - శాంతి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

రాష్ట్రవ్యాప్తంగా 341 మంది కవులు 'యుద్ధం-శాంతి' అనే అంశంపై రచించిన కవితలతో రూపొందించిన కవితా సంపుటిని ఇటీవల నెల్లూరు సమీపంలోని వెంకటాచలంలో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఆవిష్కరించారు. ఆ కేంద్రం డైరెక్టర్..ప్రముఖ కవి-రచయిత డా. మాడభూషి సంపత్‌కుమార్, సాహితీ విమర్శకులు టేకుమళ్ళ వెంకటసుబ్బయ్య, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి.. ప్రముఖ సాహితీవేత్త జల్ది విద్యాధరరావు (హైదరాబాద్), సాహితీవేత్త సరికొండ నరసింహరాజు సహకారంతో ఈ పుస్తకాన్ని అద్భుతంగా రూపుదిద్దారు. తొలిప్రతిని చిన్ని నారాయణరావు అందుకున్నారు. మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ, యుద్ధాల వల్ల సంక్షోభాలు తప్పవని, దానివల్ల ప్రపంచానికి ముప్పుతప్పదని అన్నారు. యుద్ధం ప్రపంచానికి వినాశనం కలిగిస్తే, శాంతి భావితరానికి వెలుగుబాటలు వేస్తుందన్నారు. 'సాహిత్యం' అంటే ప్రజల హితం కోరేదని, కవులు-సాహితీవేత్తలు సమాజాభ్యున్నతికి, ముఖ్యంగా శాంతిసామరస్యాల సాధనకు రచనలు చేయాలని సాహితీవేత్తలు సూచించారు. టేకుమళ్ళ వెంకటసుబ్బయ్య పుస్తకాన్ని సమీక్షించారు. ఈ కవితా సంపుటిలో ప్రముఖ కవి శివారెడ్డి నుంచి ఎందరో యువ కవులు, వర్ధమాన కవుల కవితలున్నాయి. ఈ కార్యక్రమంలో నెల్లూరు కవులు అవ్వారు శ్రీధర్‌బాబు, ఇసనాక దయాకర్‌రెడ్డి, కవయిత్రులు నెల్లూరు ఇందిర, పార్లపల్లి నాగేశ్వరమ్మ, అధ్యయన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన యువతకి..మంచి అవకాశం

విశాఖపట్టణంలోని స్కిల్ డెవలప్‌మెంట్ వారు హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో గిరిజన యువత కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ ఫెరిఫెరల్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ కోర్సులపై ఈ శిక్షణ ఉంటుందని, ఇంటర్‌మీడియట్, ఐటిఐ, డిప్లొమా, బీటెక్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తిచేసి, 18 నుండి 28 సంవత్సరాల మధ్యనున్న గిరిజన యువత ఈ కోర్సులకి అర్హులని నెల్లూరు ఐటీడీఏ పీడీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనంతో పాటు స్టడీ మెటీరియల్, ఎన్ఎస్‌డీసీ సర్టిఫికెట్ అందించడమే కాక, ప్రముఖ కంపెనీల్లో వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తారని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 81878 99877 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని సూచించారు.

## క్యుఆర్ కోడ్ ద్వారా..

# పారదర్శకతకు ప్రాధాన్యత

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు చేసిన పౌరుల నుండి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా "సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్"ను అందుబాటులోకి తెచ్చిందని, దీనిద్వారా పారదర్శకతకు ప్రాధాన్యత వస్తుందని జిల్లా పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, డీఆర్వో విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి కార్యాలయం చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ ప్రత్యేక శ్రద్ధ వహించారని, ప్రజల సమస్యల పరిష్కార ప్రక్రియ ఎంత పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతుందో తెలుసుకోవడానికి ఈ ఫీడ్‌బ్యాక్ ఎంతో కీలకమని తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## రైతుబజార్లలో..

# తక్కువ ధరలకే సరుకులు

ప్రజలు ఇబ్బందులు పడకుండా నిత్యావసర సరుకులను రైతుబజార్లలో తక్కువ ధరకే ఇచ్చే ఏర్పాటుచేస్తోంది ప్రభుత్వం. నెల్లూరు నవాబుపేటలోని రైతుబజార్‌లో ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆమేరకు ఒక స్టాల్‌ని ప్రారంభించి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన బియ్యం, కంది పప్పు, మినపప్పు, వంటనూనెలు రైతుబజార్ స్టాల్స్‌లో తక్కువ ధరకు ఇచ్చే విధంగా ఏర్పాటు చేశామని, జిల్లాలోని అన్ని రైతుబజార్లలో ఉన్న ప్రత్యేక స్టాల్స్‌లో ప్రజలు సరుకులు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనితాకుమారి, డీఎస్ఓ పుల్లయ్య, వాణిజ్యసంఘాల నాయకుడు రంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రామాయపట్నం పోర్టు పనులు..

# డిసెంబర్ నాటికి పూర్తి

## - రాజ్యసభలో బీఎంఆర్ ప్రశ్నలకి కేంద్రమంత్రి జవాబు -



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే 80.55 శాతం పనులు పూర్తయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించినట్లు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్ తెలిపారు. ఈనెల 21న రాజ్యసభలో తాను అడిగిన ప్రశ్నకు కేంద్ర ఓడరేవులు, నౌకాశ్రయాలు మరియు జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తనకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారన్నారు. ఆ వివరాల ప్రకారం, రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా ఉందన్నారు. పోర్టుకు అనుసంధానంగా తెట్టు రైల్వే స్టేషన్ వరకు 7.40 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం చేపట్టగా, దానికి రైల్వేశాఖ నుంచి ఆమోదం లభించిందని, ఇప్పటివరకు 30శాతం పనులు పూర్తయ్యాయని, ఆ పనులను కూడా డిసెంబర్ 2026 నాటికి పూర్తిచేయనున్నట్లు కేంద్రం పేర్కొన్నదని వెల్లడించారు. అలాగే జాతీయ రహదారి-16తో రామాయపట్నం పోర్టును అనుసంధానించే 5.5 కిలోమీటర్ల రోడ్డు పనులు 95 శాతం పూర్తయ్యాయని, ఈ కనెక్టివిటీ పనులను 2026 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయనున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, సాగర్‌మాల పథకం కింద దేశవ్యాప్తంగా పోర్టు కనెక్టివిటీ అభివృద్ధికి రూ.1,614.51 కోట్ల విలువైన 20 ప్రాజెక్టులకు ఆమోదం లభించగా, అందులో కేంద్ర ప్రభుత్వం రూ.406.54 కోట్ల ఆర్థిక సహాయం మంజూరు చేసి, ఇప్పటివరకు రూ.378.69 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం వివరించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం పోర్టు కనెక్టివిటీకి సంబంధించిన రెండు ప్రాజెక్టులకు కూడా కేంద్రం ఆర్థిక సహాయం అందించినట్లు బీఎంఆర్ తెలిపారు.

# వెంకన్నపురంలో రూ.1.40 కోట్లతో అభివృద్ధి పనులు

## ప్రారంభించిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తదితరులు

కోవూరు నియోజకవర్గంలోని వెంకన్నపురం గ్రామంలో ఇటీవల కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన 3 కిలోమీటర్ల తారు రోడ్డును కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. పలు అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య సహకారంతో గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ, ఉపాధి కేంద్రాన్ని పరిశీలించి, కోరమాండల్ కంపెనీ ఏర్పాటు చేసిన గ్రోమోర్ న్యూట్రి క్లినిక్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాజీ ఐఏఎస్ అధికారి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ సొంత ఊరి అభివృద్ధిపై ఆయన నిరంతరం దృష్టిపెట్టడం అభినందనీయమన్నారు. అనంతరం, అదే వేదికపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తరపున రూపొందించిన పర్యావరణహిత జనపనార సంచులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తదితరులు పాల్గొన్నారు.

# రూరల్‌లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

## • టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, మరోవైపు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అమలుచేస్తున్నామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరు రూరల్‌లోని గొల్లకందుకూరు గ్రామంలో గుండ్లపాలెం పి.ఏ.సి.ఎస్. సొసైటీ ఛైర్మన్ పముజుల ప్రదీప్ సారథ్యంలో 36 లక్షల రూపాయలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభమైంది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో గొల్లకందుకూరు గ్రామ అభివృద్ధికి 6 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ఛైర్మన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## దివ్యాంగులకు అండగా.. వీపీఆర్ ఫౌండేషన్

### జిల్లాలో 1,040 ట్రైసైకిళ్ల పంపిణీ



ట్రైసైకిల్‌ని పంపిణీ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇటీవల నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు మరో ఇద్దరు దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లను అందజేశారు. మధుమేహం (డయాబెటిస్) కారణంగా కాళ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు బాధితుల పరిస్థితిని తెలుసుకున్న వేమిరెడ్డి దంపతులు, వారికి ఆసరాగా ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ట్రైసైకిళ్లు అందుకున్న లబ్ధిదారులు తమకు అండగా నిలిచిన వేమిరెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1,040 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేయడం జరిగిందని ఫౌండేషన్ వర్గాలు తెలిపాయి.

## పోలీసు కాలనీ పార్కు వాకర్స్ ప్రమాణస్వీకారం



సభ్యులకి సర్టిఫికెట్‌లను అందజేస్తున్న సుబ్బారెడ్డి, బలరామయ్యనాయుడు

నెల్లూరు పొదలకూరురోడ్డులోని పోలీస్‌కాలనీలో పార్కు వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 19న జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ 203–డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, రీజినల్ కౌన్సిలర్ పలగాటి శ్రీనివాసులరెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ మెట్టు సుధాకర్‌రెడ్డి పాల్గొని నూతన కమిటీ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కొత్త కమిటీకి బొల్లిగర్ల రామచంద్రయ్య ప్రెసిడెంట్‌గా, కె.మాధవ్ కార్యదర్శిగా, ఎం.శ్రీనివాసులు కోశాధికారిగా ఎన్నికయ్యారు. అదేవిధంగా, జాయింట్ సెక్రటరీలుగా పి. ప్రభాకర్, కే.కార్తీక్, వై.శంకరయ్య, ఎం.వెంకటేశ్వర్లునాయుడు, వైస్ ప్రెసిడెంట్–కమిటీ కన్వీనర్‌గా డి.ఓబుల్‌రాజు, ఈసీ మెంబర్లుగా వై.పెంచలయ్య, షేక్ ముజుబుర్ రెహమాన్, అంబటి నరసింహ, రాంగోపాల్, కీర్తి శ్రీనివాసులు, వీరేపల్లి సాంబశివరావు, సోంపల్లి మాల్యాద్రి ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు. గౌరవాధ్యక్షులుగా ఎన్నుకోబడిన రిటైర్డ్ డీఎస్పీ కందుకూరి రమణయ్య, నేలపాటి చిన అంకయ్య, పొట్లూరి సుబ్రహ్మణ్యం, శివరామయ్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## విద్యార్థులకు.. సైకిళ్ల పంపిణీ వాయిదా



సైకిళ్ళని పరిశీలిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 10వేల మంది విద్యార్థులకు సైకిళ్ళ పంపిణీ వర్షాల కారణంగా వాయిదా పడింది. వాతావరణం అనుకూలిస్తే ఈనెల 24న గానీ, లేదా 25న వాటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 19న ఆయన అధికారులు, నాయకులతో కలసి నెల్లూరు వీఆర్‌సి మైదానంలో ఆ సైకిళ్ళను పరిశీలించారు. దాదాపు 6 కోట్ల రూపాయల సొంత నిధులతో మంత్రి నారాయణ విద్యార్థులకు సైకిళ్ళను పంపిణీ చేయాలని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీన తొలివిడతగా 7వేల సైకిళ్ళను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు కానీ, వర్షం రాకతో వీఆర్‌సీ మైదానంలో నీళ్ళు చేరాయి. దీంతో ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మంత్రి తెలిపారు.

## కార్పొరేషన్‌కి..సీఎం నుంచి అవార్డు



సీఎం చంద్రబాబు నుండి అవార్డునందుకుంటున్న డాక్టర్ దినేష్

ఇటీవల సుమారు నెల రోజుల పాటు నెల్లూరు నగరంలో మరింత పెద్దఎత్తున పరిశుభ్రతా చర్యలు చేపట్టినందుకు నెల్లూరు నగరపాలక సంస్థవారిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెచ్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో భాగంగా నగరంలో ఆ కార్యక్రమాన్ని బాగా ముమ్మరం చేసి మంచి ఫలితాలు సాధించడంతో 3 లక్షలకి పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో, నెల్లూరుకు 'బెస్ట్ పర్‌ఫార్మన్స్' అవార్డునిచ్చి అభినందించారు. కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నుంచి ఆ అవార్డును నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్ అందుకున్నారు.

## విద్యుత్ ఆటోలు వచ్చేశాయ్!

నెల్లూరు నగరంలో ఇంటింటి చెత్త సేకరణకు కొత్తగా నూటొక్క విద్యుత్ ఆటోలు వచ్చేశాయి. 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' సాధనలో భాగంగా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృష్ణాజిల్లా గుడివాడ నుంచి నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా నెల్లూరుకు ఈ ఇ–ఆటోలను విడుదల చేయడంతో, 'స్వచ్ఛ నెల్లూరు'కు ఒక అడుగు ముందుపడినట్లే. నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలిలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, మేయర్ సుజాత, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నగర మేయర్ నందన్, డిప్యూటి మేయర్లు రూప్‌కుమార్‌యాదవ్, తహాశీన్‌లతో పాటు మహిళా నాయకురాలు కప్పిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డులో మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహానికి నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు తరహాలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని శ్రీనివాసులురెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు మరియు గణేష్ ఘాట్‌లను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. గణేష్ ఘాట్ వద్ద ఆర్చిల నిర్మాణానికి నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సహకారంతో అతిత్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 'నీట్' ఫలితాలలో..

## 'విశ్వసాయి' ప్రభంజనం



విజయచిహ్నం చూపుతున్న విశ్వసాయి విద్యార్థినీ విద్యార్థులు

'నీట్–2026' ఫలితాలలో నెల్లూరులోని 'విశ్వసాయి' విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో పాటు అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారని కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని విశ్వసాయి కళాశాలలో ఈనెల 17న ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ, తమ కళాశాల నుంచి 80 మందికిపైగా విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్‌లో చేరడానికి అర్హత సాధించారన్నారు. వారిలో డి.ఉష 510 మార్కులను, కె.గీతిక హాసిని 506 మార్కులు, ఆర్.ప్రశాంతి 505, ఆర్.స్నేహశ్రీ 494 వంటి అత్యుత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ ఘనవిజయాలను సాధించిన విద్యార్థులకు, సాధింపజేసిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. కళాశాల వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, వత్తిడి లేని శిక్షణతో పాటు విద్యార్థుల పట్టుదల ఈ విజయాలకు కారణమని తెలిపారు. కళాశాల డైరెక్టర్ శివసంకేత్ మాట్లాడుతూ, భవిష్యత్తులో నీట్ పరీక్షలో జరగబోయే మార్పులకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని, వాటిద్వారా ఈ విజయపరంపర కొనసాగుతోందని అన్నారు.




శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవ ఆహ్వానము

తేది. 29-07-2026 బుధవారం నుండి తేది. 06-08-2026 గురువారము వరకు జరుగును.

కార్యక్రమ వివరములు:

తేది. 29.7.2026 బుధవారం నుండి తేది.04.8.2026 మంగళవారం వరకు ప్రతిరోజు ఉ॥7-00గం.ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును. పై పూజా కార్యక్రమాలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా దగ్గర రూ.300/- చెల్లించి పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీ బాబా వారి కృపకు పాత్రులగుదురని ఆశిస్తున్నాము.

బాబా నగరోత్సవం:

తేది.05-8-2026 బుధవారం సా॥ 6.00 గం॥లకు పుష్పాలంకరణలతో, మంగళవాయిద్యములతో, విద్యుత్‌దీప కాంతులతో, బాణాసంచా వేడుకలతో శ్రీ షిర్డి సాయిబాబా మందిరం నుండి గాంధీబొమ్మ, ట్రంక్‌రోడ్, ఏ.సి.సెంటర్, సంతపేట మండపము, చిన్నబజార్, పెద్దబజార్, బారకాసు, వి.ఆర్.కాలేజ్ సెంటర్, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మీదుగా తిరిగి నగరోత్సవం శ్రీ షిర్డి సాయిబాబా మందిరానికి చేరును.

తేది.06.8.2026 గురువారము మ॥12.00గం.లకు అన్నదానము జరుగును.

(పై అన్నదానముకు భక్తులు తమకు తోచిన విధంగా వస్తురూపంగా గానీ, ధన రూపంగా గాని చెల్లించి తగిన రశీదు పొందవలెను)

ఇట్లు: కార్యవర్గం

శ్రీ షిర్డి సాయిబాబా మందిరము

గాంధీనగర్ (ట్రంకురోడ్డు), నెల్లూరు.

## నెల్లూరు హస్తకళలకి...
# ప్రత్యేక గుర్తింపు

**ఉదయగిరి చెక్క వస్తువులు, పాటూరు చీరలకు ప్రాధాన్యత**

### లోక్‌సభలో ఎంపీ విపిఆర్ ప్రశ్నకి.. కేంద్రమంత్రి సమాధానం



దేశంలో ప్రతి జిల్లా కేంద్రంగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' (ఓడీఓపీ) పథకం కింద శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు సంబంధించిన వివరాలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 21న లోక్‌సభలో పలు ప్రశ్నలు లేవనెత్తారు. నెల్లూరు జిల్లా నుంచి ఉత్పత్తుల ఎంపిక, వాటి ఉత్పత్తి, విక్రయాలు, ఉపాధి కల్పన, ఎగుమతులకు కేంద్రం అందిస్తున్న సహాయంపై విపిఆర్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద మంగళవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల నుంచి మొత్తం 99 ఉత్పత్తులను (26 ప్రాథమిక, 26 ద్వితీయ, 21 తృతీయ, 26 కేటగిరీ ఉత్పత్తులు) ఓడీఓపీ కింద గుర్తించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఓడీఓపీ కింద నెల్లూరు ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నెల్లూరు జిల్లా నుంచి ప్రాథమిక ఉత్పత్తిగా ఉదయగిరి చెక్క సామగ్రి (ఉదయగిరి స్పూన్లు/చెక్క వస్తువులు)ని, ద్వితీయ ఉత్పత్తిగా పాటూరు కాటన్ సిల్క్ చీరలను ఈ పథకం కింద గుర్తించినట్లు కేంద్ర మంత్రి వివరించారు. ఓడీఓపీ కింద గుర్తించిన ఉత్పత్తుల ప్రచారం, విక్రయాల కోసం ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. దేశీయంగా, అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న ప్రదర్శనల్లో ఈ ఉత్పత్తుల ప్రదర్శనకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద జాతీయ, రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోలు నిర్వహిస్తూ చేనేత రంగానికి మార్కెటింగ్ మద్దతు ఇస్తున్నామని, హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ సహకారంతో ఎగుమతికి తగిన ఉత్పత్తులను గుర్తిస్తున్నట్లు తెలిపారు.

# దేశభక్తికి ప్రతీకగా..'ఐ లవ్ నెల్లూరు'!

**• మంత్రి నారాయణ**

నెల్లూరు నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా, స్థానిక మినీ బైపాస్ రోడ్డులో చేపడుతున్న 'ఐ లవ్ నెల్లూరు' సెల్ఫీ పాయింట్ నిర్మాణ పనులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం పరిశీలించారు. ఇదే ప్రాంగణంలో 100 అడుగుల ఎత్తైన జాతీయ పతాక స్థూపాన్ని నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. పతాకం చుట్టూ అందమైన ఫౌంటెన్ తదితర ఆకర్షణీయమైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.



సెల్ఫీ పాయింట్ నమూనాను చూపుతున్న మంత్రి నారాయణ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

అంతేకాకుండా, నెల్లూరు జిల్లా ఏర్పడిన ప్పటి నుంచి సేవలందించిన ఎమ్మెల్యేలు, ఎంపీల ఛాయాచిత్రాలతో ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యువతలో దేశభక్తి, జాతీయ విలువలు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల పట్ల గౌరవాన్ని పెంపొందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని చెప్పారు. నెల్లూరుకు వచ్చే ప్రతి ఒక్కరూ తప్పకుండా సందర్శించే ప్రత్యేక ల్యాండ్‌మార్క్‌గా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. కమిషనర్ నందన్, మేయర్ సుజాత, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలను ఉయ్యాల ఊపుతున్న మంత్రి నారాయణ

### పార్కు పరిశీలన..

నెల్లూరు నగర పరిధిలోని 48వ డివిజన్ అబ్దుల్ కలాం పార్క్‌ను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, కమిషనర్ నందన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రజలతో కలిసి జిమ్‌లో పాల్గొనడమే కాకుండా, చిన్నపిల్లలను ఉయ్యాల ఊపుతూ వారితో సరదాగా గడిపారు.






## శ్రీసిటీలోని అకార్డ్ స్కూల్‌కు..
# కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ గుర్తింపు



స్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్

శ్రీసిటీలోని అకార్డ్ స్కూల్‌కు యు.కే కి చెందిన ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గుర్తింపు లభించింది. దీనిని అధికారికంగా ధృవీకరించారు. దీంతో అకార్డ్ స్కూల్లో ఇకపై కేంబ్రిడ్జ్ ప్రైమరీ (5–11 ఏళ్లు), కేంబ్రిడ్జ్ లోయర్ సెకండరీ (11–14 ఏళ్లు) విద్యా కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఈ గుర్తింపుతో విద్యార్థులకు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన పాఠ్యాంశాలు, అంతర్జాతీయస్థాయి కేంబ్రిడ్జ్ చెక్‌పాయింట్ అసెస్‌మెంట్లు, ఉన్నత విద్యతో పాటు గ్లోబల్ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించే అవకాశం కలుగుతుంది. సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించే విధంగా ఈ పాఠ్య ప్రణాళిక రూపొందించబడి ఉంటుంది. ఈ సందర్భంగా అకార్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందా త్యాగరాజన్ మాట్లాడుతూ, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ నెట్‌వర్క్‌లో భాగస్వామ్యం కావడం తమకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థులను స్థానికంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించేలా తీర్చిదిద్దే విద్యను అందించేందుకు ఈ గుర్తింపు దోహదపడుతుందని చెప్పారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా.రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, అకార్డ్ స్కూల్‌కు కేంబ్రిడ్జ్ గుర్తింపు రావడం ద్వారా శ్రీసిటీలో ప్రపంచ స్థాయి విద్యా అవకాశాలు మరింత విస్తరిస్తాయని, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దే దిశగా ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు.

### మంత్రి లోకేష్ అభినందనలు..

ఇటీవల శ్రీసిటీ హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసిన అకార్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందా త్యాగరాజన్, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ గుర్తింపును ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ గుర్తింపు ప్రాంత విద్యా అభివృద్ధికి ప్రధాన మైలురాయిగా నిలుస్తుందన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.




# అమెరికా విద్యా వేతనాలు : భవిష్యత్తును మార్చగల అవకాశాలు!

విదేశాల్లో చదువు అనేది ఒక విద్యార్థి జీవితాన్ని కొత్త దిశలో నడిపించే శక్తి. 'సంకల్పమే శక్తి' అనే సూక్తి చెప్పినట్లే, ఈ ప్రయాణం స్పష్టమైన సంకల్పం, క్రమశిక్షణ, మరియు ముందస్తు ప్రణాళిక (planning) మీదే నిలబడుతుంది. ప్రపంచం వేగంగా మారుతున్న ఈ యుగంలో, అమెరికా వంటి దేశాల్లో చదువు అనేది కేవలం ఒక విద్యా నిర్ణయం కాదు; అది ఒక కుటుంబం, ఒక విద్యార్థి, ఒక భవిష్యత్తు కలిసి నిర్మించే సుదీర్ఘ ప్రయాణం. ఈ ప్రయాణాన్ని సాధ్యమయ్యే మార్గాల్లో విద్యా వేతనాలు (scholarships) ఒక కీలక పునాది, ఒక ఆశ, ఒక అవకాశంగా నిలుస్తున్నాయి. అమెరికా.. ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విద్యా వ్యవస్థను కలిగి ఉంది. అక్కడి విశ్వవిద్యాలయాలు పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలలో ముందంజలో ఉంటాయి. కానీ ఈ అవకాశాలు ఖర్చుతో కూడినవి. అమెరికాలో చదువు ఖర్చు సాధారణంగా రూ. 30–60 లక్షల మధ్య ఉంటుంది. ఈ ఖర్చు ప్రతి కుటుంబానికి భారం. అందుకే, విద్యా వేతనాలు భారతీయ విద్యార్థులకు ఒక కీలక మార్గం. ఇవి కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు; ఇవి విద్యార్థి ప్రతిభకు, నైపుణ్యానికి, దిశకు, క్రమశిక్షణకు ఇచ్చే గుర్తింపు. "ప్రతిభకు సరిహద్దులు లేవు" అనే సూక్తి అమెరికా విద్యా వేతనాల సందర్భంలో మరింత నిజమవుతుంది.

అమెరికా విద్యా వేతనాలు అనేక రకాలుగా ఉంటాయి. ప్రతిభ ఆధారిత వేతనాలు (Merit-based), ఆర్థిక అవసరాలపై ఆధారిత వేతనాలు (Need-based), పరిశోధనకు సంబంధించిన వేతనాలు (Research-based), విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా ఇచ్చే వేతనాలు (University-specific), మరియు కార్యక్రమం ఆధారంగా ఇచ్చే వేతనాలు (Program-specific). భారతీయ విద్యార్థులు వీటిని తెలుసుకోవడం అత్యంత అవసరం. చాలా మంది విద్యార్థులు వేతనాలు అంటే కేవలం Fulbright మాత్రమే అనుకుంటారు. కానీ అమెరికాలో వందలాది వేతనాలు ఉన్నాయి, వాటిలో అనేకం భారతీయ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. ఈ వేతనాలు విద్యార్థి ప్రతిభను ప్రపంచానికి చూపే వేదిక. విద్యా వేతనాలు పొందడానికి ముందస్తు పరిశోధన (advanced research) మరియు సమగ్ర ప్రణాళిక (planning) అత్యంత కీలకం. లక్ష్యానికి తగ్గ విశ్వవిద్యాలయం, ఎంపిక చేసిన కార్యక్రమం (program of choice), దరఖాస్తు సమయం (application timeline) గురించి ముందుగానే లోతుగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థి సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవచ్చు. అంతేకాక, విశ్వవిద్యాలయం అందించే ఆర్థిక సహాయం (financial assistance) పొందే అవకాశాలు కూడా పెరుగుతాయి. చాలామంది విద్యార్థులు చివరి నిమిషంలో దరఖాస్తులు వేస్తారు; ఇది వేతనాలు పొందే అవకాశాలను తగ్గిస్తుంది. "కాలమే మార్పుకు మూలం" అనే సూక్తి చెప్పినట్లే, సమయాన్ని సక్రమంగా వినియోగించడం విద్యార్థి ప్రయాణంలో ఎంతో కీలకం.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

అమెరికాలో భారతీయ విద్యార్థులకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన వేతనాల్లో Fulbright--Nehru Fellowships, Stanford Knight-Hennessy Scholarships, MIT Graduate Fellowships, AAUW International Fellowships, Tata-Cornell Scholar ships, అలాగే విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా ఇచ్చే Graduate Assistant ships, Research Assistantships (RA), Teaching Assistantships (TA) వంటి అనేక అవకాశాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రపంచ స్థాయి వేతనాలు; పోటీ అత్యంత తీవ్రమైనది. కానీ భారతీయ విద్యార్థులు ప్రతిభతో, స్పష్టమైన ఉద్దేశ్య ప్రకటన (Statement of Purpose-SOP), నిజాయితీతో కూడిన దరఖాస్తు, మరియు సమగ్ర సిద్ధతతో ఈ వేతనాలను పొందగలరు. SOPలో విద్యార్థి కథ, దిశ, లక్ష్యం, సమాజానికి చేయాలనుకునే సేవ..ఇవన్నీ స్పష్టంగా ఉండాలి. SOPను తేలికపాటి దారులు (shortcuts) ద్వారా రాయలేరు; అది విద్యార్థి స్వరాన్ని, నిజాయితీని ప్రతిబింబించాలి. "సత్యమే శాశ్వతం" అనే సూక్తి SOPకి సరిపోతుంది. Recommendation letters (సిఫార్సు పత్రాలు) కూడా నిజాయితీతో ఉండాలి. అనుభవాన్ని అతిశయోక్తిగా చూపడం, తేలికపాటి దారులు వెతకడంలాంటివి ప్రమాదకరం. అమెరికా విశ్వవిద్యాలయాలు ఇప్పుడు కృత్రిమ మేధస్సుతో తయారైన రచనలు (AI-generated content), తప్పుదారి చూపించే సమాచారం (misrepresentation), మరియు నకిలీ పత్రాలు (fraudulent documents) వంటి అంశాలపై అత్యంత కఠినమైన పరిశీలనతో వ్యవహరిస్తున్నాయి. కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, లేదా ఇంజినీరింగ్ వంటి ఏ రంగం చదవాలనుకున్నా, ఆ రంగానికి సంబంధించిన వేతనాలు, విశ్వవిద్యాలయాల funding అవకాశాలు, RA/TA స్థానాలు, పరిశోధన గ్రాంట్లు, మరియు NSF వంటి ప్రతిష్ఠాత్మక fellowships ఇవన్నీ ముందుగానే లోతుగా తెలుసుకోవడం విద్యార్థికి అవసరం. ఇవన్నీ విద్యార్థి దిశను బలపరుస్తాయి, వారి విద్యా ప్రయాణానికి పునాది వేస్తాయి. విద్యా వేతనాలు పొందడానికి విద్యార్థి చూపాల్సిన ముఖ్యమైన లక్షణాలు.. నిజాయితీ, క్రమశిక్షణ, స్పష్టమైన దిశ, సమాజానికి సేవ చేయాలనే తపన, మరియు విద్యా నైపుణ్యాలు. తేలికపాటి దారులు(shortcuts) ద్వారా వేతనాలు రావు. విద్యా వేతనాలు పొందడం కేవలం ఆర్థిక సహాయం కాదు; అది విద్యార్థి జీవితంలో ఒక మలుపు. ఒక Fulbright scholar, ఒక Knight-Hennessy scholar, ఒక NSF fellow.. వీరి ప్రయాణం ప్రపంచాన్ని మార్చగలిగే శక్తిని కలిగి ఉంటుంది. భారతీయ విద్యార్థులు ప్రపంచాన్ని గెలుచుకునే సామర్థ్యం కలవారు. సరైన దిశ, సరైన సిద్ధత, సరైన ప్రణాళిక, మరియు నిజాయితీ ఉంటే, అమెరికా విద్యా వేతనాలు వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతాయి. విదేశాల్లో చదువు ఒక కఠినమైన ప్రయాణం; shortcuts లేవు. ప్రపంచ సాంకేతికత వేగంగా మారుతోంది, వలస విధానాలు కఠినతరం అవుతున్నాయి. కానీ ప్రతిభ, నిజాయితీ, శ్రమ..ఇవి ఎప్పటికీ మారవు. ఇవే విద్యార్థిని ప్రపంచపౌరుడిగా తీర్చిదిద్దే శక్తి.



**వచ్చే వారం:** ప్రపంచ విశ్వవిద్యాలయాల కోసం ప్రొఫైల్ నిర్మాణం : ముఖ్యమైన మార్గదర్శిని.

E-mail: reddyu@gmail.com

## ఆధ్యాత్మిక క్విజ్‌లో.. విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులందజేస్తున్న నిర్వాహకులు

అవధూత దత్తపీఠం నెల్లూరుశాఖ, శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞానబోధ సభ ట్రస్టు వారు ఇటీవల నిర్వహించిన ఆధ్యాత్మిక క్విజ్ పోటీలలో 140 మంది విద్యార్థులు పాల్గొని ఆధ్యాత్మిక రంగంలో తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు సంప్రదాయక దుస్తులను బహుమతులుగా ఇచ్చారు. సర్టిఫికెట్లను కూడా ప్రదానం చేశారు. పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులందరికీ నోటుపుస్తకాలను, పెన్నులను బహుకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. సమాజహితం కోసం, విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతనాసక్తి పెంపుదల కోసం ఈ క్విజ్ పోటీలు నిర్వహించామని ట్రస్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. ట్రస్టు సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో.. సుహాసిని పూజలు



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 19న సుహాసిని పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు శివకుమార్ ఆధ్వర్యంలో 1008 మంది మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఈ పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవాధ్యక్షుడు శేగు షణ్ముగరావు పర్యవేక్షించారు.

## 26న..వేద విజ్ఞాన వేదిక సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా 175వ ప్రసంగం ఈనెల 26న ఉంటుందని వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు చెన్నై టీనగర్‌లోని కృష్ణాహాల్–ఆంధ్రాక్లబ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో 'విరాటపర్వం–తిక్కన నాటకీయత' అనే అంశంపై అవధాన విద్వన్మణి డా. బులుసు అపర్ణ ప్రసంగిస్తారని, సాహితీప్రియులందరూ తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## స్కూల్‌బస్‌లను తనిఖీచేసిన డీఎస్పీ

కావలి పట్టణంలోని పలు స్కూల్‌బస్సులను కావలి డీఎస్పీ వీవీ రమణకుమార్ ఈనెల 19న ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సులకు సంబంధించిన పత్రాలు సర్లైనవా కావా అని పరిశీలించారు. వాహన డ్రైవర్ల లైసెన్సులు సరిగా ఉన్నాయో లేదో చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్సుల ఫిట్‌నెస్‌గా లేకుంటే వాటి యాజమాన్యాలపై చర్యలు తప్పవన్నారు. పరిమితికి మించి బస్సుల్లో పిల్లలను ఎక్కించకూడదని, బస్సుల్లో డ్రైవర్‌తోపాటు సహాయకుడు ఉండాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్సుల్లో డ్రైవర్‌ల నడవడిక సక్రమంగా లేకున్నా, మద్యం సేవించి ఉన్నా తమకు సమాచారం అందిస్తే, ఆ వాహనాల డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఆటోల పార్కింగ్‌పై..కేసులు



ఆటోడ్రైవర్లకి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు నగరంలో ఆటోలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్న వారిని గుర్తించి, నెల్లూరు రవాణాశాఖ వారు ఈనెల 18న 12 కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల పట్ల కౌన్సిలింగ్ ఇచ్చారు. జిల్లా మోటార్ వెహికల్ స్క్వాడ్ అధికారి రాంబాబు, ఇన్స్‌పెక్టర్లు రఫీ, పూర్ణచంద్రరావు, రఘువర్దన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

## మునిసిపల్ స్కూళ్లలో టీచర్లను నియమించండి



డీఇఓ బాలాజీరావుకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీయు నాయకులు

నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న పలు మునిసిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఉన్నతాధికారులు పరిశీలించి ఉపాధ్యాయులను నియమించాలని ఎస్టీయు జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు రాజమనోహర్ కోరారు. ఈనెల20న ఆమేరకు ఆయన నెల్లూరులోని జిల్లావిద్యాశాఖ కార్యాలయంలో డీఇఓ బాలాజీరావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్టీయు జిల్లా కార్యదర్శి సుమన్, వీరాస్వామి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో..

## బాలల గేయరచన పోటీలు

డిసెంబరులో ఒంగోలులో నిర్వహించనున్న నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు–బాలల కార్యక్రమాలను పురస్కరించుకుని బాలల గేయరచన పోటీలు నిర్వహిస్తున్నామని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. పోటీలో ఏ వయసువారైనా పాల్గొనవచ్చని, గేయం 15 పంక్తులకు మించకుండా ఉండాలని తెలిపారు. తెలుగుభాష, సంస్కృతి, జీవన విధానంపై గేయం ఆసక్తి కలిగించే విధంగా ఉండాలన్నారు. పోటీలకు పంపే గేయాల రాతప్రతిని పీడీఎఫ్ రూపంలో ఆగస్టు 10వ తేదీ లోపు 98669 95085 నంబరుకు వాట్సప్ ద్వారా పంపాలని, తొలి ముగ్గురు విజేతలకు వరుసగా 3వేలు, 2వేలు, వెయ్యి రూపాయల వంతున బహుమతులిస్తామని, అంతేకాక, మరో 10 ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయని తెలిపారు.

## గ్రూప్–2 దరఖాస్తులకు..గడువు పెంచారు

గ్రూప్–2 ప్రిలిమనరీ పరీక్షలు రాయాలనుకుంటున్నవారికి బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25వ తేదీ దాకా గడువును పొడిగించినట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా శిక్షణకు వందమంది అభ్యర్థులను ఎంపికచేస్తామని, వారికి 2 నెలలపాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని, ఈనెల 30 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. అభ్యర్థులు పూర్తివివరాలతో నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె వివరించారు.


'జగన్ 2.0 యాప్'ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

## 'జగన్ 2.0 యాప్'.. కార్యకర్తలకు భరోసా!

### వైసీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

'జగన్ 2.0 యాప్'.. కార్యకర్తలకు ఓ భరోసా అని వైసీపీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని వైసీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆ యాప్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త తనకు జరిగిన అన్యాయాన్ని స్వేచ్ఛగా యాప్‌లో నమోదు చేసేందుకు అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచకాలు, దుర్మార్గాలు పెచ్చు మీరిపోయాయని ఆరోపించారు. ప్రశ్నించడమే శాపం అన్నట్లుగా తయారైందని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం.. జైలుకు పంపడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అలివి కాని హామీలను.. అమలు చేయాలని.. ప్రశ్నించినందుకు తప్పుడు కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ నిర్వాకాలను ప్రజలకు తెలియజేసేందుకు.. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగన్ 2.0 సూపర్ యాప్‌ను ప్రారంభించారని తెలిపారు.

## ఆత్మకూరు సచివాలయంలో రికార్డుల తనిఖీ

ఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న ఇటీవల స్థానిక వీఆర్ఓ కార్యాలయ పరిధిలోని సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ప్రతి ఆరోగ్యకార్యక్రమాన్ని రికార్డుల్లో నమోదుచేయాలని సిబ్బందికి సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, హెల్త్ ప్రొవైడర్ పార్వతి, హెల్త్ అసిస్టెంట్ రవీంద్రరెడ్డి పాల్గొని డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్.. బకాయిలు చెల్లించాలి

### ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి


ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భగత్ రవి

రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సుమారు 6400 కోట్ల రూపాయల దాకా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయని, దీంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఈనెల 18న నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశంలో నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భగత్ రవి మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టి.త్రివిక్రమ్, కార్యదర్శిగా టి. రవీంద్ర, ఉపాధ్యక్షులుగా యగ్నేష్, ప్రవీణ్, సహాయ కారదర్శులుగా నాని, జయంత్‌లతో పాటు మరికొందరిని సభ్యులుగా ఎన్నిక చేసుకున్నారు.

## 'విక్రమ్' విజయవంతంపై.. శ్రీసిటీ ఎం.డీ హర్షం



దేశంలో ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన తొలి రాకెట్ విక్రమ్-1 శ్రీహరికోట నుంచి విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించడం చరిత్రాత్మక విజయమని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సీఈఓ పవన్‌కుమార్ చందన నేతృత్వంలోని బృందానికి అభినందనలు తెలిపారు. ఈ విజయం భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటడంతో పాటు, ఆవిష్కరణలు మరియు సహకారానికి నూతన అధ్యాయాన్ని ప్రారంభించిందని ఆయన అన్నారు. అంతరిక్ష రంగంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తున్న ఇన్-స్పేస్ సంస్థ ఛైర్మన్ డాక్టర్ పవన్‌కుమార్ గోయెంకా నాయకత్వాన్ని డా. సన్నారెడ్డి ప్రశంసించారు.

## జొన్నవాడలో నిత్యాన్నదానానికి.. 2.05 లక్షల విరాళం


దేవాలయ ఈఓ శ్రీనివాసులురెడ్డికి విరాళాన్నందజేస్తున్న దాతలు

జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో శాశ్వత నిత్య అన్నదానానికి కోవూరు మండలం చినపడుగుపాడు వాస్తవ్యులు అట్లూరు బుజ్జిరెడ్డి-అక్కమ్మ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు ఇటీవల రూ. 2,05,000/- విరాళమిచ్చారు. దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డికి ఆ విరాళం మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతల గోత్రనామాలతో శ్రీ మల్లికార్జున స్వామి-కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించి స్వామివార్ల శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## డిఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా


నియామకపత్రాలు అందుకున్నవారితో ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిఆర్‌డబ్ల్యూ డిగ్రీ కాలేజ్ ఆవరణలో ఇటీవల మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో సుమారుగా 24 కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. జాబ్ మేళాకు 401 మంది నిరుద్యోగులు పాల్గొనగా, వీరిలో మంచి ప్రతిభ కనబరిచిన 291 మంది నిరు ద్యోగులు ఉద్యోగానికి ఎంపిక కావడం జరిగింది. మరో 24 మందికి తదుపరి ఇంటర్వ్యూకి పంపడం జరుగుతుంది. ఎంపికైన వారికి ఆయా కంపెనీల ప్రతినిధులు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్ ఎం. వినయ్‌కుమార్, సెట్నెల్ సీఈఓ ఎ.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.చెంచురామయ్య, డిఆర్‌డబ్ల్యూ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఎ.ఇ.పి హనుమంతరావు, వైస్ ప్రిన్సిపల్ పి. గాయత్రి పాల్గొన్నారు.

## 'తల్లికి వందనం' అర్హుల జాబితాపై కసరత్తు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య

తల్లికి వందనం అర్హుల జాబితాపై జడ్పీ డిప్యూటీ సి. ఈ. వో బ్రహ్మయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో పెండింగ్‌లో ఉన్న జాబితాను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ గ్రామ పరిధిలోని సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పోటుపాలెం, నెల్లటూరు, దివిపాలెం, మిట్టాత్మకూరు తదితర ప్రాంతాల్లో తల్లికి వందనం జాబితాపై ఆరా తీశారు. ఎంపిడిఓ మధుసూదన్‌రావు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


పోడియం, రాక్స్‌ని అందజేస్తున్న ముని గిరీష్, భాస్కర్

## జడ్పీ ఉన్నత పాఠశాలకు స్టేషనరీ రాక్స్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొణిదల ముని రామయ్య తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు కొణిదల మునిభాస్కర్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొణిదల మునిగిరీష్ దాతృత్వంతో చిల్లకూరు మండలం కడివేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఇటీవల 30 వేల రూపాయలు విలువ చేసే స్టూడెంట్స్ స్టేషనరీ రాక్స్, పాఠశాలకు పోడియం అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు తిరుమూరు సురేష్‌రెడ్డి, దాతలు ముని గిరీష్, ముని భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, క్లబ్ ప్రతినిధులు దశరథరామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, హరిప్రసాద్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పారిచర్లవారిపాలెంలో

## వాటర్ ప్యూరిఫయ్యర్ యూనిట్


పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ యూనిట్‌ను అందజేస్తున్న రామకృష్ణ

చిల్లకూరు మండలం, పారిచర్లవారిపాలెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు ఇటీవల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాసిలి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రామకృష్ణ స్వరూప్ వాటర్ ప్యూరిఫైయ్యర్ యూనిట్‌ని అందజేశారు.

## 12వ జగన్నాథ రథయాత్ర


జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలో 12వ జగన్నాథ రథయాత్ర పట్టణ పురవీధుల్లో వైభవంగా సాగింది. భక్తులు 'హరే రామ-హరే కృష్ణ' నామస్మరణ చేస్తూ రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంగళ వాయిద్యాలు, కేరళ బ్యాండ్, కోలాటం, పండరి భజన, విచిత్ర వేష ధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. 'హరే రామ - హరే కృష్ణ' నామస్మరణ చేస్తూ భక్తులు నృత్యాలు చేశారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు


అధికారులతో సమీక్షిస్తున్న ఏపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య

గూడూరు పట్టణంలోని సబ్ డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో ఇటీవల డివిజన్‌లోని విద్యుత్ అధికారులతో ఏపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా విద్యుత్ సరఫరా ఫిర్యాదులు, నూతన లైన్ల ఏర్పాటుపై చర్చించారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. డైరెక్టర్ గురవయ్య మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని, వేసవికాలం ముగిసినా విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉందని, ఎప్పటికప్పుడు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని అన్నారు. ఇ.ఇ. నరేందర్ రెడ్డి, ఏ.ఇ.లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' అవార్డులు



విద్యార్థులకు అవార్డులనందజేస్తున్న మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లాలో ఇటీవల పదో తరగతి, ఇంటర్‌లలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహంగా ఇటీవల నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో మంత్రి నారాయణ చేతుల మీదుగా "షైనింగ్ స్టార్స్ అవార్డ్స్-2026"ను ప్రదానం చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్, ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు బహుమతి వంతున అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 224 మంది పదో తరగతి, 36 మంది ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కష్టపడితే ఎంతటి లక్ష్యాన్నయినా సాధించవచ్చన్నారు. అపజయాలను సవాల్‌గా తీసుకుని, కష్టపడి చదువుకుని విద్యార్థులంతా ఉన్నత శ్రేణిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. నెలకు రూ.120 జీతంతో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా ప్రారంభమైన తన ప్రయాణం, నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యను అందించే సంస్థలను నిర్మించే స్థాయికి చేరిందని మంత్రి తాను కష్టపడిన రోజులను విద్యార్థులకు వివరించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ దేవరకొండ సుజాత పాల్గొన్నారు.

## బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో..
# గణేష్ ఉత్సవాలు!




సమావేశంలో మాట్లాడుతున్న బయ్యా వాసు

ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకుందామని 'శుభమస్తు' అధినేత భయ్యా వాసు అన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని విశ్రాంతి హోటల్‌లో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమానికి దైవశక్తిని మిళితం చేసి గణేష్ ఉత్సవాలతో సమాజశక్తిని సంఘటితం చేసిన మహనీయుడు బాలగంగాధర్ తిలక్ అని, వారి స్ఫూర్తితో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవడం సముచితంగా ఉంటుందని అన్నారు. తొలుత, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు పిట్టి సత్యనాగేశ్వరావు మాట్లాడుతూ, గణేష్ ఘాట్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లను వివరించారు. జిల్లా అధ్యక్షుడు గడ్డం విజయకుమార్, నగర అధ్యక్షులు కొండపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ వినాయక చవితి సెప్టెంబర్ 14వ తేదీ కాగా, ఐదవ రోజు సెప్టెంబరు 18వ తేదీ శుక్రవారం నాడు సామూహిక గణేష్ నిమజ్జనోత్సవం నెల్లూరు నగరంలో గణేష్ ఘాట్-పెన్నా ఘాట్‌లలో జరిగే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శులు మండ్ల ఈశ్వరయ్య, టి.భాస్కర్‌రెడ్డి, వి.హర్షవర్ధన్, ఫణిరాజ్, మహేష్ కుమార్, ఏవిఆర్ మోహన్‌రావు, శివకుమార్ ఆచారి, నారా శ్రీనివాసులు, ప్రసాదు, నాగ శ్రీనివాసులు, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## అర్హులైన రైతులందరికీ..
# పంటల బీమా

జిల్లాలో అర్హులైన ప్రతిరైతుకీ పంటల బీమా పథకం అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. ఈనెల 22న నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన పంటల బీమా పథకం అమలుపై పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా పథకాల ముఖ్య ఉద్దేశాలు, రైతులకు కలిగే ప్రయోజనాలు, నమోదు విధానం, చివరి తేదీలు, ప్రీమియం వివరాలను ప్రతి గ్రామంలోని రైతులకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి రైతు నిర్ణీత గడువులోపు పంటల బీమాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌కు వరి, వేరుశెనగ, పత్తి, నిమ్మ పంటలు బీమా పరిధిలో ఉన్నాయని తెలిపారు. దిగుబడి ఆధారిత పంటల బీమా పథకాన్ని టాటా ఏఐజి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేస్తున్నట్లు వివరించారు. ఖరీఫ్-2024 వరకు ఈ-పంట ఆధారంగా ఉచిత పంటల బీమా అమలులో ఉండగా, రబీ-2024-25 నుంచి రుణగ్రహీత, రుణేతర రైతులకు స్వచ్ఛంద నమోదు విధానం అమలులో ఉందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పంట రుణం పొందిన రైతులు బీమాకు అర్హులని, రుణేతర రైతులు కూడా అధీకృత కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి పి.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

## రవాణాదారులకు
# శుభవార్త!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు మరియు యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫాం సంయుక్త ఆధ్వర్యంలో రూపొందిస్తున్న "ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్" మొబైల్ యాప్ ద్వారా రాష్ట్రంలోని లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు, ఫ్లీట్ ఓనర్లు మరియు ఇతర రవాణా సంస్థలను ఒకే డిజిటల్ లాజిస్టిక్స్ వేదికపైకి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వేదిక జాతీయ లాజిస్టిక్స్ వ్యవస్థతో అనుసంధానమై రవాణా రంగంలో పారదర్శకత, వేగం మరియు సౌలభ్యాన్ని పెంపొందించేందుకు రూపొందించారు. ఈ యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా రవాణాదారులు తమ వివరాలను ప్రభుత్వ ఆధారిత డిజిటల్ లాజిస్టిక్స్ వ్యవస్థలో నమోదు చేసుకునే అవకాశం లభిస్తుంది. జిల్లాలోని లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ సంస్థలు, ఫ్లీట్ ఓనర్లు మరియు అన్ని రవాణాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని AP Transport Connect యాప్‌లో నమోదు చేసుకోవాలని రవాణా శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

# సోమిరెడ్డి నివాసంలో.. టీడీపీ నేతల సమావేశం



నెల్లూరు సమీపంలోని అల్లీపురంలో ఉన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో ఇటీవల తిరుపతి పార్లమెంటు టీడీపీ నియోజకవర్గ సమావేశం జరిగింది. టీడీపీ నేతలు.. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం టీడీపీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సోమిరెడ్డితో పాటు, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, పార్టీ నాయకులు.. సత్యవేడు ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి, తిరుపతి ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొని తిరుపతి పార్లమెంటు నియోకవర్గ పరిధిలో రాజకీయ పరిస్థితులను చర్చించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం అందరూ శ్రమించాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి-సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేస్తుండాలన్నారు.

# 'సుమన్ ఫర్నిచర్'లో.. సరికొత్త ఆఫర్లు!




అతి తక్కువ ధరలకు, నాణ్యమైన ఫర్నిచర్‌ను మ్యాన్యుఫ్యాక్చరింగ్ ధరలకే వినియోగదారులకు అందించే 'సుమన్ ఫర్నిచర్'లో తాజాగా సరికొత్త ఆఫర్లు ఇస్తున్నారు. ఫర్నీచర్ రంగంలో దాదాపు పాతికేళ్ల అనుభవం వున్న గడ్డం సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు హరనాథపురంలో నడిచే ఈ ఫర్నిచర్ సంస్థ అందమైన-నాణ్యమైన వస్తువులకు పెట్టింది పేరుగా ఉన్న విషయం వినియోగదారులందరికీ తెలిసిందే. ఎన్నో రకాల ఆధునిక డిజైన్లతో ఫర్నిచర్ అందుబాటులో ఉండడం 'సుమన్ ఫర్నిచర్' ప్రత్యేకత. ఈ నేపథ్యంలో, ప్రజల సౌలభ్యం కోసం తాజాగా మరిన్ని ఆకర్షణీయమైన ఆఫర్లు ఇచ్చేందుకు నిర్ణయించామని సుమన్‌రెడ్డి తెలిపారు. కొద్దిరోజుల వరకే ఈ స్పెషల్ ఆఫర్ ఉంటుందని, వినియోగదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## షిర్డి సాయిబాబా దేవాలయంలో..
# 29 నుంచి 'గురుపూర్ణిమ' మహోత్సవాలు



నెల్లూరు గాంధీనగర్ (ట్రంకురోడ్డు)లో భక్తుల కొంగుబంగారంగా వెలసి ఉన్న శ్రీ షిర్డి సాయిబాబా దేవాలయంలో ఈనెల 29వ తేదీ బుధవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ గురువారం వరకు గురుపూర్ణిమ మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. మందిర కమిటీ కార్యవర్గ సభ్యులు మన్నెం అమరనాథరెడ్డి, పైడిపాటి సుధాకరరావు, కొల్లి శ్యాంసుందరరెడ్డి, దువ్వూరు జయమ్మల ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి బాబావారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు నిర్వహిస్తారు. ఆగస్టు 5న సాయిబాబా నగరోత్సవం మరింత వైభవంగా నిర్వహించనున్నారు. మందిరం వద్ద నుంచి గాంధీబొమ్మ కూడలి, ట్రంకురోడ్డు, ఏ.సీ సెంటరు, సంతపేట మండపం కూడలి, చిన్నబజారు, పెద్దబజారు, బారకాసు, వీఆర్ కాలేజీ సెంటర్, కో-ఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంకు మీదుగా నగరోత్సవం నేత్రపర్వంగా జరుగుతుంది. 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదానం నిర్వహిస్తారు. ఈ మహోత్సవాలకు భక్తులు తరలివచ్చి బాబావారి కృపకు పాత్రులు కావలసిందిగా ఆలయ కమిటీ వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎన్‌సిసి క్యాడెట్లతో.. జాతీయ పతాక ఆమోద దినోత్సవం



జాతీయ పతాకం ప్రాధాన్యతను తెలియజేస్తున్న గుండాల నరేంద్రబాబు

నెల్లూరు వెంగళరావునగర్‌లోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఈనెల 22న 10- ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి ఫస్ట్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్లు 'జాతీయ పతాక ఆమోద దినోత్సవాన్ని' నిర్వహించారు. నెల్లూరులోని 10 ఆంధ్ర నేవల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గోదంగవే కమాండింగ్ ఆఫీసర్ ఆదేశాలతో జరిగిన ఈ కార్యక్రమంలో నరేంద్రబాబు మాట్లాడుతూ, మాట్లాడుతూ దేశ సమగ్రతకు జాతీయ సమైక్యతకు జాతీయ జెండా నిదర్శనమన్నారు. ఈ జాతీయ పతాకాన్ని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య రూపొందించారని జాతీయ పతాకం విశిష్టతను వివరించారు. 1947వ సంవత్సరం జూలై 22వ తేదీన ఈ త్రివర్ణ పతాకాన్ని జాతీయ జెండాగా మన రాజ్యాంగ పరిషత్ ద్వారా స్వీకరించి ఆమోదించుకున్నామన్నారు.

## నిధుల స్వాహాపై..
# విచారణ చేపట్టాలి

జిల్లాలోని సమగ్ర శిక్ష విభాగంలో జరిగిన నిధుల స్వాహాపై విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు లీలామోహన్ డిమాండ్ చేశారు. ఈనెల 21న నెల్లూరులో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, పాఠశాలల ప్రహరీలు నిర్మించకుండానే నిధులను దారిమళ్ళించారని, పాఠశాలల పనుల్లో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం దారుణమని విమర్శించారు. ఈ పనులన్నిటిపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా జిల్లాలో ఉపాధిహామీ పథకంలోనూ జరిగిన అవినీతిపై విచారణలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

## వారాహి మాతకి విశేషపూజలు.. హోమాలు



ఆషాఢ మాసం సందర్భంగా నెల్లూరులోని విఘ్నేశ్వర భక్తబృందం, ఛత్రపతి శివాజీ సేన వారు సంయుక్తంగా వారాహి మాత అమ్మ వారికి ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. స్థానిక వీఆర్ కళాశాల మైదానంలో ఈనెల 18న జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేదపండితులు మహేశ్‌శర్మ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించి, భక్తులతో అమ్మవారికి కుంకుమార్చనలు చేయించారు. అమ్మవారి ఉపాసకులు సుధాకర్ ఈ పూజలను పర్యవేక్షించారు.

## జిల్లా సైన్స్ అధికారిగా..కేవీఆర్ మూర్తి

జిల్లా సైన్స్ అధికారిగా అనంతసాగరం జడ్పీహెచ్‌ఎస్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా ఉన్న కేవీఆర్ మూర్తి నియమితులయ్యారు. ఈనెల 21న ఆయన నెల్లూరు సమీపంలోని చెముడుగుంటలో ఉన్న జిల్లా సైన్స్ కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి డా.బాలాజీ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో సైన్స్ ఉన్నతికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

## శివపార్వతులకు ప్రాకారోత్సవం

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఆలయ అర్చకులు ఈనెల 20న ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసిన అనంతరం చిన్న రథంపై వేంచేపు చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తరించారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

# మెగా రక్తదాన శిబిరం



రక్తదాతలతో ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ & పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రంగనాయకుల పేటలోని అసోసియేషన్ కల్యాణమండపంలో చేపట్టిన ఈ శిబిరంలో 90మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం విశేషం. అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ళ రాంబాబు మాట్లాడుతూ, రక్తదానమంటే ప్రాణదానమేనని, అత్యవసర సమయంలో రక్తదానం చేయడం వల్ల బాధితుల ప్రాణాలను నిలబెట్టినట్లవుతుందని అన్నారు. అసోసియేషన్ సెక్రటరీ ఏ.ఫణీంద్రకుమార్, కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం, కిషోర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చందోలు సతీష్‌కుమార్ 20వ సారి రక్తదానం చేసి అందరి ప్రశంసలందుకున్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్‌కి నిరసన

ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని ఖండిస్తూ ఈనెల 21న నెల్లూరులో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులపై లాఠీచార్జి దారుణమన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యాల వల్ల దేశంలో లక్షలాదిమంది విద్యార్థులు, వారి తల్లితండ్రులు మానసిక వేదనకు గురయ్యారని ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన విమర్శించారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మహిళ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

తమ జీవనోపాధికి ఇబ్బంది కలిగేలా ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం దారుణమంటూ ఈనెల 20న నెల్లూరులో డాక్యుమెంట్ రైటర్లు (దస్తావేజు లేఖరులు) ఆందోళన చేపట్టారు. ఆ సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు దుర్గేష్‌బాబు మాట్లాడుతూ, జిల్లాలో డాక్యుమెంట్ రైటర్లుగా ఎంతోమంది జీవనం సాగిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న కొత్త విధానాల వల్ల తమ జీవనానికి సమస్య ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమ కష్టాలను గుర్తించి జీఓ నం. 396ని వెంటనే రద్దు చేయాలని కోరారు.

## పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

తమ సమస్యల సాధన కోసం నెల్లూరులోని పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈనెల 30న 'చలో కలెక్టరేట్' నిర్వహిస్తామని వారు తెలిపారు. స్థానిక జీజీహెచ్ వద్ద ఈనెల 21న జరిగిన ధర్నాలో వైద్యఆరోగ్య కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని, ప్రతినెలా ఒక సాధారణ సెలవుతో పాటు, ప్రభుత్వమే నేరుగా కార్మికుల ఖాతాల్లో జీతాలు జమచేయాలని కోరారు. ఆమేరకు జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి సందానిబాషా, విజయకుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.

## టూకీగా...



### కుడితిపాలెంలో.. రక్తదాన శిబిరం

ఇందుకూరుపేట మండలం కుడితిపాళెం గ్రామంలో ఈనెల 19న ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. 50 మంది గ్రామస్తులు రక్తదానం చేశారు. స్థానిక ప్రముఖులు దేవిరెడ్డి వెంకటప్రసాద్‌రెడి, ఎం.వెంకటరామిరెడ్డి, నాయుడు సురేష్, షేక్ సొబ్జాన్, ఇబాదుల్లా, ఎస్.రవి, జి. నారాయణ, పేడూరు మురళి పర్యవేక్షించారు.

### కంపసముద్రం హాస్టల్ విద్యార్థులకు యూనిఫామ్‌లు

మర్రిపాడు మండలం కంపసముద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలోని విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫామ్‌లు, షూస్, సాక్సులు, స్పోర్ట్స్ డ్రెస్‌లు, దుప్పట్లు వగైరాలు పంపగా, వాటిని ఈనెల 19న స్థానిక టీడీపీ నాయకుడు మల్లు రవి కుమార్‌రెడ్డి విద్యార్థులకు పంపిణీచేసి, అందరూ బాగా చదువుకోవాలని చెప్పారు. ఇన్‌చార్జి వార్డెన్ మహమ్మద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

### తాటాకులదిన్నెలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

కొడవలూరు మండలం తాటాకులదిన్నె గ్రామ శివారుల్లోని పొలాల్లో ఈనెల 19న పేకాటాడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి 11వేల రూపాయలు స్వాధీనం చేసుకుని, ఎస్ఐ కోటిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

### పడకండ్లలో.. కోడిపందెంగాళ్ళపై కేసులు

ఆత్మకూరు మండలం పడకండ్ల అటవీప్రాంతంలో పోలీసులు ఈనెల 19న దాడిచేసి, కోడిపందాలు నిర్వహిస్తున్న నలగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 3 కోళ్ళు, 7140 రూపాయలతో పాటు నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జంపానికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

### మనుబోలులో జనపనార సంచుల పంపిణీ

మండలకేంద్రమైన మనుబోలులోని కోదండరామపురంలో ఈనెల 19న శ్రీ సేవానాథం ట్రస్ట్ సభ్యులు గ్రామస్తులకు జనపనార సంచులు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీనాథ్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామని, పర్యావరణాన్ని నాశనం చేసే, ప్లాస్టిక్ కవర్లకి బదులుగా జనపనార సంచులు వినియోగించుకోవాలని వారు ప్రజలకు సూచించారు.

### పిడూరులో..'పొలం పిలుస్తోంది'

మనుబోలు మండలంలోని పిడూరు గ్రామంలో ఈనెల 20న మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి, రైతులకు వ్యవసాయం పట్ల, ఎరువుల వినియోగం పట్ల అవగాహన కలిగించారు. సేంద్రీయ విధానాలతో పచ్చిరొట్ట పైర్లను సాగుచేసుకోవడం ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు.

### చుంచులూరులో.. చికెన్‌వ్యర్థాల వాహనం పట్టివేత

మర్రిపాడు మండలం చుంచులూరు క్రాస్‌రోడ్డు వద్ద ఈనెల 20న పోలీసులు చికెన్ వ్యర్థాలు తీసుకువెళ్తున్న ఓ వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఉన్న 12 డ్రమ్ముల దుర్గంధపూరితమైన చికెన్ వ్యర్థాలను ఊరి వెలుపల పాతిపెట్టారు. ఆ వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

### నందివాయిలో విద్యార్థులకు పలకలు పంపిణీ

పొదలకూరు మండలంలోని నందివాయి ప్రాథమిక పాఠశాలలో దాత తుళ్ళూరు చెంచురామయ్య ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థులకు పలకలు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పీవీ కండ్రిగలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

ఇందుకూరుపేట మండలం పీవీ కండ్రిగ పాఠశాలలో ఇటీవల స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. బాలబాలికలు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పచ్చదనం-పరిశుభ్రత ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం, పాఠశాల హెడ్మాస్టర్ సిహెచ్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమం చేపట్టారు.

# బొడ్డుపల్లి పురుషోత్తం.. రచనలు స్ఫూర్తిదాయకం

- శతజయంతి సభలో వక్తలు

'సాహితీ చతురానన', 'ఉపన్యాస కేసరి" బిరుదాంకితులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, తెలుగు ప్రాచ్య శాఖాధ్యక్షులుగా పనిచేసిన డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తం శతజయంతి మహోత్సవం నెల్లూరు టౌన్‌హాల్‌లో ఇటీవల వైభవోపేతంగా జరిగింది. పురుషోత్తం కుమార్తె..స్థానిక వేద సంస్కృత కళాశాల విశ్రాంత తెలుగు రీడర్ డా. కప్పర గిరిజాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ శతజయంతి సభకు శతావధాని కొండపి మురళీకృష్ణ తమ ఆశుకవితాధారతో పద్య నీరాజనం సమర్పించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ ప్రసంగిస్తూ, బొడ్డుపల్లి పురుషోత్తం సాహిత్యాన్ని తమ జీవితంలో ఒక భాగంగా భావించలేదని, వారి జీవితమే సాహిత్యంగా వారి ప్రస్థానం కొనసాగిందని కొనియాడారు. ప్రముఖ కవిపండితులు ఆచార్య సూరం శ్రీనివాసులు మాట్లాడుతూ, 'వ్యాకరణ వేత్త అయిన బొడ్డుపల్లివారు భాషాశాస్త్ర వేత్త కూడా కావడం విశేషమని, తెలుగు భాషను గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన ఎన్నో విషయాలను 'వాగనుశీలనమ'నే పుస్తకంలో తేటగీతిలో వారు తేటపరిచారని', ఆయన రచనలు భావితరాల వారికి కూడా స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ సందర్భంగా



ప్రసంగిస్తున్న కవి పండితులు డాక్టర్ సూరం శ్రీనివాసులు

బొడ్డుపల్లి వారి రచనలను అందరికీ అందుబాటులో ఉంచేవిధంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను పద్యసారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు ఆవిష్కరించారు. www.bpurushttam.org అనే లింకు ద్వారా బొడ్డుపల్లి పురుషోత్తం వ్యక్తిగత, వృత్తిగత, సాహితీ జీవిత వివరాలతో పాటు వారి ముద్రిత గ్రంథాల పీడీఎఫ్‌లను కూడా చదువుకోవచ్చునని బొడ్డుపల్లి పురుషోత్తం కుమారులు రాఘవ, శేషాద్రి, మారుతి తెలియజేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రముఖ కవులు-రచయితలు డా. గంగిశెట్టి శివకుమార్, కోట శ్రీరామమూర్తి, కవయిత్రులు పాతూరు అన్నపూర్ణ, గోవిందరాజు సుభద్రాదేవి, పార్లపల్లి నాగేశ్వరమ్మ తదితరులను డా.గిరిజాలక్ష్మి కుటుంబసభ్యులు సన్మానించారు.

## ఆలయాల వద్ద పటిష్ట భద్రత

### - దేవాదాయమంత్రి ఆనం -



రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల వద్ద భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. దేవతా విగ్రహాలపై దుశ్చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఈనెల 23న అమరావతిలో ఆయన మాట్లాడుతూ, తిరుమల నుంచి కిందికి వెళ్లే ఘాట్ రోడ్డులో 7వ కిలోమీటర్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో జరిగిన ఆంజనేయస్వామి విగ్రహం అపహరణ ఘటనను తిరుపతి జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆంజనేయస్వామి విగ్రహం అపహరణ కేసును 24 గంటల్లో ఛేధించిన తిరుపతి జిల్లా ఎస్పీకి, పోలీసు సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తిరుమలలోని ఆలయాలు, ఉపాలయాలు, ఘాట్ రోడ్లు మరియు పరిసర ప్రాంతాల్లో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతో పాటు నిఘా వ్యవస్థను ఇంకా బలోపేతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. ప్రజలు, భక్తులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తిరుమల వంటి మహా పుణ్యక్షేత్రంలో మాత్రమే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏ ఒక్క ఆలయంలోనైనా ఇలాగ దేవతా విగ్రహాలపై దుశ్చర్యలకు పాల్పడితే కూటమి ప్రభుత్వం ఏమాత్రం సహించదని మంత్రి స్పష్టం చేశారు.

## పెరిగిపోతున్న 'లేడీ కిల్లర్స్'




***ఒకప్పుడు కుటుంబ వ్యవస్థ అంటే విశ్వాసానికి, ప్రేమకి, పరస్పర గౌరవానికి ప్రతీకగా భావించేవారు. భార్య-భర్తల బంధం జీవితాంతం కొనసాగే అనుబంధంగా నిలిచేది. కానీ ఇటీవల వరుసగా వెలుగులోకి వస్తున్న కొన్ని హత్య కేసులు ఆ బంధాలపై సమాజంలో కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా భర్తల హత్య కేసుల్లో భార్యలు లేదా వారి సహచరుల ప్రమేయం ఉందనే ఆరోపణలు పురుష జాతిని భయాందోళనలకి గురిచేస్తున్నాయి. గత ఏడాది జరిగిన మేఘాలయ హనీమూన్ హత్య కేసు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. కొత్తగా పెళ్లైన యువతి తన భర్త హత్యకు కుట్ర పన్నిందనే ఆరోపణలు కోట్లాది మందిని షాక్‌కు గురిచేశాయి. ఆ తర్వాత మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో కూడా భార్యలే భర్తల హత్యలకు పాల్పడ్డారనే ఆరోపణలతో కేసులు వార్తల్లో నిలిచాయి. ఇవన్నీ న్యాయస్థానాల పరిశీలనలో ఉన్న కేసులే అయినప్పటికీ, ఒక విషయం మాత్రం స్పష్టమవుతోంది. కుటుంబ సంబంధాల్లో ఉద్రిక్తతలు కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయి.***

ఈ నేపథ్యంలో మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఇలాంటి కేసులు నిజంగానే పెరుగుతున్నాయా? లేక సామాజిక మాధ్యమాలు , 24 గంటల వార్తా ప్రసారాల వల్ల అవి ఎక్కువగా కనిపిస్తున్నాయా? వాస్తవానికి రెండింట్లోనూ కొంత నిజం ఉంది. నేరాలు కొత్తవి కావు. కానీ నేడు ప్రతి కేసు సంచలనాత్మకమై దేశవ్యాప్తంగా క్షణాల్లో వ్యాపిస్తోంది. అందువల్ల ఇలాంటి ఘటనలు మరింత ఎక్కువగా జరుగుతున్నాయనే భావన కూడా కలుగుతోందనడంలో సందేహం లేదు. అయితే ఈ పరిణామాలను కేవలం "లేడీ కిల్లర్స్" అనే శీర్షికకి పరిమితం చేయడం సరైంది కాదు. ప్రతి హత్య వెనుక ఒక సంక్లిష్టమైన కుటుంబ, సామాజిక, ఆర్థిక, మానసిక నేపథ్యం ఉంటుంది. వివాహేతర సంబంధాలు, ఆస్తి వివాదాలు, అప్పుల ఒత్తిడి, నిరంతర కుటుంబ కలహాలు, పరస్పర అనుమానాలు, కోప నియంత్రణ లోపం, మానసిక ఆరోగ్య సమస్యలు, ఇవన్నీ కలిసి కొన్ని సందర్భాల్లో నేరాలకు దారితీస్తున్నాయి.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయాన్ని కూడా గుర్తించాలి. ఎక్కడో కొన్ని సంచలనాత్మక కేసుల ఆధారంగా పూర్తిగా మహిళా సమాజంపైనే పురుష జాతికి అనుమానాలు పెరగడం అతి ప్రమాదకరం. నేరానికి లింగం ఉండదు. పురుషులు నిందితులుగా ఉన్న కేసులు కూడా ఇప్పటికీ భారీ సంఖ్యలో నమోదవుతున్నాయి. అలాగే గృహహింస, లైంగిక హింస, వరకట్న వేధింపులు వంటి నేరాల్లో మహిళలే పెద్ద సంఖ్యలో బాధితులుగా ఉన్నారు. కాబట్టి కొన్ని సంఘటనల ఆధారంగా మొత్తం మహిళా సమాజాన్ని ఒకే కోణంలో చూడటం సబబు కాదు.

అయితే ఇలాంటి కేసులు ఒక సందేశంతో కూడిన స్పష్టమైన హెచ్చరిక మాత్రం ఇస్తున్నాయి. మన కుటుంబాల్లో సంభాషణ తగ్గుతోంది. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునే సహనం తగ్గుతోంది. చిన్న విభేదాలు కోర్టుల వరకు, అక్కడి నుంచి హింసాత్మక ఘర్షణల వరకు వెళ్తున్నాయి. సామాజిక మాధ్యమాలు , తక్షణ సంతృప్తి కోరుకునే జీవనశైలి, వ్యక్తిగత స్వార్థం పెరగడం, కుటుంబ పెద్దల జోక్యం తగ్గిపోవడం వంటి మార్పులు కూడా ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రమయ్యేలా చేస్తున్నాయి. నేరం జరిగిపోయిన తర్వాత శిక్ష విధించడం న్యాయవ్యవస్థ బాధ్యత. కానీ నేరం జరగకుండా నిరోధించడం సమాజం, కుటుంబం, విద్యా వ్యవస్థ, ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. వివాహానికి ముందు కౌన్సెలింగ్, కుటుంబ సలహా కేంద్రాల బలోపేతం, మానసిక ఆరోగ్య సేవల విస్తరణ, కుటుంబ వివాదాల్లో వేగవంతమైన మధ్యవర్తిత్వ వ్యవస్థ ఇలాంటివన్నీ కాలానుగుణ అవసరాలుగా కనిపిస్తున్నాయి.

ఒకప్పుడు "గృహమేకదా స్వర్గసీమ" అని చెప్పుకునే కుటుంబాల్లోనే ఇప్పుడు రక్తపాతం చోటుచేసుకుంటే అది కేవలం ఒక పోలీసు కేసుగానో, క్షణికావేశంలో జరిగిన ఒక నేరంగానో చూడకూడదు. సమాజం ఎదుర్కొంటున్న విలువల సంక్షోభానికి అద్దం పట్టే ఘటనగా పరిగణించాలి. ఈ సంక్షోభాన్ని మహిళల సమస్యగానో, పురుషుల సమస్యగానో కాకుండా కుటుంబ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాలుగా పరిగణించాలి. సంచలన శీర్షికలు కొన్ని రోజులకే మాయమవుతాయి. కానీ వాటి వెనుక దాగి ఉన్న సామాజిక హెచ్చరికను విస్మరిస్తే భవిష్యత్తులో మూల్యం మరింత భారీగా చెల్లించాల్సి రావచ్చు. విశ్వాసం స్థానంలో అనుమానం, సంభాషణ స్థానంలో హింస, సహనం స్థానంలో ప్రతీకారం స్థిరపడితే నష్టపోయేది కేవలం ఒక్క కుటుంబమే కాదు మొత్తం సమాజం అన్న వాస్తవాన్ని మనం గ్రహించాలి. ఈ తరహా ఘటనలను కేవలం వార్తలుగా చదివి మర్చిపోవడం కాకుండా, కుటుంబ బంధాలను బలోపేతం చేసే దిశగా సమాజం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది..!

## కొండెక్కిన కోడిగుడ్డు!

### ఒక్కగుడ్డు ధర.. 7 రూపాయలా 33 పైసలు



***కోడిగుడ్డు ధర కూడా బాగా పెరిగిపోయింది. ఇటీవలి కాలంలో ఎప్పుడూ లేనంతగా ఒక కోడిగుడ్డు 7 రూపాయలా 33 పైసలకి చేరింది. బాబోయ్ ఒక్క కోడిగుడ్డు ఇంత ధరా అని సామాన్యులు గుడ్లెళ్ళ పెడుతున్నారు. ఒకప్పట్లో రెండు మూడు రూపాయలకే దొరికే గుడ్డు.. ఇప్పుడు ఇంతగా ధర పెరగడంతో బీదసాదలకు మరింత భారమైంది. పౌష్టికాహారంగా అత్యధికశాతం ప్రజలు కోడిగుడ్డును బాగా ఇష్టపడుతుంటారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు కోడిగుడ్డు ఆమ్లెట్, లేదా ఉడికించిన కోడిగుడ్లు తింటుంటారు. కూరల్లో కోడిగుడ్డు వేపుడు కూర రుచే వేరు. అంతగా ప్రజలకు అలవాటైపోయిన కోడిగుడ్డు ధర కొండెక్కి కూచోవడంతో.. నిరుపేదలు వాటిని కొనలేక బిక్కమొఖం పెడుతున్నారు.***

కోడిగుడ్డు మంచిపౌష్టికాహారం. ఆరోగ్యానికి మంచిది కూడా. అందుకే, ఇళ్లలోనే కాక అంగన్‌వాడీ చిన్నారులకు, గర్భిణులకు, హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు నిత్యం కోట్లాదిమందికి ఇది పుష్టికరమైన ఆహారంగా మారింది. కోడిగుడ్లు సంపూర్ణ పోషకాహారంగా ప్రసిద్ధి. మనకు అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. రోజుకో కోడిగుడ్డు తినడం వల్ల దేహదారుఢ్యం పెరుగుతుంది కూడా.

### వంద గుడ్లు 733 రూపాయలు

ఈనెల 23వ తేదీ గురువారం నాటికి మార్కెట్లో కోడిగుడ్లు ధరలు మరింత మండిపోతున్నాయి. ఒక గుడ్డు రూ.7.33 పైసలయితే, డజను గుడ్ల ధర రూ.87.96 పైసలు చెప్తున్నారు. ఒక ట్రే గుడ్లు (30 ఉంటాయి)..వీటి ధర 220 దాకా ఉంది. అయితే, చికెన్ ధరతో పోల్చుకుంటే ఇది తక్కువే. కేజీ చికెన్ 294 రూపాయలు అమ్ముతుంటే, కేజీ కోడిగుడ్ల ధర 139 రూపాయలకే వస్తాయి. కేజీ అంటే 19 కోడిగుడ్లు వరకు ఉంటాయన్నమాట. జులై 1న వంద కోడిగుడ్ల ధర 713 రూపాయలకు పెరిగితే, ఈనెల 23 కల్లా 733కి చేరింది. జులై 16 నుంచి 743 రూపాయలకు పెరిగిన కోడిగుడ్ల ధర 22వ తేదీ దాకా అలాగే ఉన్నా, 23 నాటికి కొంచెం తగ్గి 733కి చేరింది. అయినా, ఇది కూడా భలే రేటు కిందనే లెక్క.

### మండే ఎండలే ప్రధాన కారణం

ఈ మండుతెన్న ఎండల రోజుల్లో కోళ్లు ఎక్కువగా చనిపోతుండడంతో కోడిగుడ్లు తక్కువగా వస్తున్నాయని, దీంతో వాటి ధర పెరుగుతోందని మార్కెట్‌లో వ్యాపారులు చెప్తున్నారు. మరోవైపు కోళ్ల ఫారాల్లో కోళ్ళకు వేసే మేత ధర కూడా బాగా పెరిగింది. అయితే, కోడిగుడ్ల వినియోగం మాత్రం బాగానే ఉంది. ఈ ధరలు గిట్టుబాటు ధర కిందకి రావని, సాగుబడి ధర అంటారని వారు చెప్తున్నారు. ఎందుకంటే, కోడిగుడ్ల వినియోగం ఎలా ఉందో, ఆయా ప్రాంతాలను బట్టి, వాటి ఉత్పత్తిని బట్టి నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ వారు ఏరోజుకారోజు ధరను నిర్ణయిస్తుంటారు. దేశవ్యాప్తంగా 34 రకాల ధరలుంటాయి..ఆయా రాష్ట్రాలను బట్టి. ఈ కమిటీలో కోళ్ళ రైతులు, వ్యాపారులు ఉంటారు. వారు నిర్ణయించే ధరే మార్కెట్‌లో ఉంటుంది. ఒక్కోరోజు పెరగొచ్చు, ఇంకో రోజు తగ్గొచ్చు. ఇవన్నీ మామూలే. హోల్ సేల్ దుకాణాల్లో వారు మార్కెట్ ధరను బట్టి గుడ్లు ఇస్తుంటారు. ఆ ధరను చిల్లర వ్యాపారాలు కొద్దిగా పెంచి 8 రూపాయలకి కూడా అమ్ముతుంటారు. మొత్తమ్మీద ఈ వ్యాపారంలో వ్యాపారులు, దుకాణదారులు బాగానే లాభపడుతున్నా, వాటిని ఉత్పత్తి చేసే రైతుల సంగతి మాత్రం షరామామూలే. నిరంతరం కష్టపడే కోళ్ళ సాగుబడిదారులకు నామమాత్రపు ఆదాయమే వస్తుండడం విచారకరమే మరి!

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com